

చెప్పారు.. చేస్తున్నారు

జూన్ వరకు ఆగండి.. జూలై నుంచి సామాజిక పింఛన్లు పెంచుతాం.. నెలనెలా రూ.4 వేలు ఇస్తాం.. ఈ మూడు నెలలకు కూడా కలిపి రూ.3 వేలను జూలై 1న ఇంటి వద్దకే వచ్చి మొత్తంగా రూ.7 వేలు అందిస్తాం.. అని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. కూటమి నేతల ప్రచారంలో కూడా సూపర్ సిక్స్‌లో భాగంగా పింఛన్ల పెంపుపై లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సోమవారం(జూలై 1) సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసింది. పింఛన్ల పంపిణీపై చంద్రబాబు చెప్పినట్లుగానే చేస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి తాడేపల్లి పరిధిలోని పెనుమాకలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేయనున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులు కూడా స్వయంగా హాజరై లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఒకేసారి రెట్టింపు పింఛను నగదు చేతికి అంద నుండటంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పండుగలా పింఛన్ల పంపిణీ

- నేటి ఉదయం ఇళ్ల వద్దకే రూ.7 వేలు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం
- రెండు గంటల్లో పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు
- బ్యాంకుల నుంచి పూర్తిస్థాయిలో ఉద్యోగులకు చేరిన నగదు
- పెనుమాకలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎక్కడికక్కడ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ఎమ్మెల్యేలు



చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

గుంటూరు, నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి టౌన్, జూన్ 30 : సామాజిక పింఛన్లకు సంబంధించి ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి కాగానే అమలుచేస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే సంతకం చేశారు. ఆ తర్వాత దానికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అన్నమాట ప్రకారం పింఛను మొత్తాన్ని రూ.3 నుంచి 4 వేలకు పెంచడమే కా కుండా ఆ మేరకు ఏప్రిల్ నెల నుంచి మూ డు నెలల బకాయితో కలిపి రూ.7 వేలను అవ్వాతాతలు, ఒంటరి, వింతంతు మహిళల ఇళ్ల వద్ద ఇవ్వనున్నారు. ఈ మేరకు సోమ వారం ఉదయం ఆరు గంటల నుంచి నగదు పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. చంద్రబాబు పింఛనును రూ.3 నుంచి 4 వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి లెక్కగట్టి మొత్తం రూ.7 వేలు అందించనుండడంతో లబ్ధిదారులు పింఛను కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. పింఛన్ల పండుగను ముఖ్యమంత్రి చంద్రబాబు తాడేపల్లి పరిధిలోని పెనుమాకలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. గ్రామంలోని ఇద్దరు లబ్ధిదారులకు స్వయంగా చంద్రబాబు ఇచ్చిన వెంటనే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ పింఛన్ల పంపిణీ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పంపిణీ సమయంలో ఏ చిన్న అవాంతరం రాకుండా ఉండేందుకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. తొలి రెండు, మూడు గంటల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 7లక్షల 73వేల 482 మంది పింఛనుదారులకు పెరిగిన పింఛన్లతో లబ్ధి చేకూరనుంది. గుంటూరు జిల్లాలో 2,59,315 మంది, పల్నాడు జిల్లాలో 2,80,568 మంది, బాపట్ల జిల్లాలో 2,33,599 మంది పింఛనుదారులకు సోమవారం పింఛనను అందించనున్నారు. వీరందరికీ పెంచిన పింఛన్లు స్వయంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పంపిణీలో సర్వర్ సమస్యలు రాకుండా సామర్థ్యం పెంచామని అధికారులు చెప్పారు. ఆదివారం బ్యాంకులకు సెలవుదినం కావడంతో ముందుగానే నగదు సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వద్దకు చేరింది. ఒక్కో ఉద్యోగి 50 మంది లబ్ధిదారుల బాధ్యత తీసుకుని పింఛను పంపిణీ చేపట్టనున్నారు. పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియను కూడా ఇప్పటికే పూర్తి చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా సిద్ధమయ్యారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి వడ్డెరగూడెం, నల్లచెరువు, గూండారావుపేట, సంతోష్‌నగర్, గుజ్జనగుండ్ల, కొండయ్య కాలనీల్లో పింఛను పంపిణీ చేస్తారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తొలుత మంగళదాస్ నగర్‌లో పింఛన్ల పంపిణీ చేస్తారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించి పల్నాడు జిల్లాలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కలెక్టర్ శ్రీకేష్ బాలాజీలత్కర్ పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దే సచివాలయ సిబ్బంది పింఛన్ నగదు అందజేస్తారని తెలిపారు.

డిక్లరేషన్ స్వీకరణ

లబ్ధిదారులకు పింఛను ఇచ్చిన తర్వాత, నగదు అందినట్లుగా వారి నుంచి డిక్లరేషన్ (రసీదు)ను సచివాలయ ఉద్యోగులు తీసుకుంటారు. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రత్యేక కరపత్రం ఇస్తారు. ఇప్పటికే వాటిని సచి వాలయాల సిబ్బందికి అందజేశారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 6 గంటలకు పెనుమాక ఎస్టీ కాలనీలో ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఆయన ఉండవల్లిలోని తన నివాసం నుంచి వేకువజామున 5.45కి బయలుదేరతారు. 5.55కు పెనుమాక చేరుకుంటారు. ఉదయం 6 గంటల నుంచి 6.20కి పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం 6.30కి మసీదు సెంటర్‌లోని ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. ఉదయం 7.15 గంటల వరకు ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. 7.15 గంటలకు పర్యటన ముగించుకుని 7.25 గంటలకు తన నివాసానికి చేరుకుంటారు.



పెనుమాకలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి



బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పెనుమాకలో విస్తృత ఏర్పాట్లు

తాడేపల్లి మండలం పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటున్నందున రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్‌లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సభా స్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, బ్యారికేడ్లు, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష 30 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించామన్నారు. ఒకే రోజు 65 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ నెలలో పాత బకాయిలతో కలిపి రూ.7 వేలు అందిస్తామన్నారు. ఆగస్టు నెల నుంచి రూ.4 వేల అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నుంచి పింఛన్ అందుకునేది వీరే



పెనుమాకలోని సుగాలికాలనీకి చెందిన బాణావత్ పాములు నాయక్ కుటుంబం చంద్రబాబు నుంచి తొలి పింఛన్ అందుకోనున్నారు. పాములు నాయక్‌కు వృద్ధాప్య, ఆయన కుమార్తె ఇస్లావత్ శివకుమారికి వితంతు పింఛన్‌ను చంద్రబాబు స్వయంగా వారి ఇంటి వద్ద అందజేయనున్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని అధికా రులు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చంద్రబాబు స్వయంగా పింఛన్లు ఇచ్చేందుకు వస్తుం డటంతో పెను మాక గ్రామం ప్రత్యేకంగా ముస్తాబవు తోంది. స్వయంగా ముఖ్యమంత్రి పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటారని తెలియడంతో గ్రామంలో సందడి నెలకొంది. చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఆదివారం జోరు వానలోనూ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు.

ఇసుక ఎప్పటికో

- కొరతతో నిలిచిపోతున్న నిర్మాణాలు
- ప్రభుత్వం కొత్త పాలసీ ప్రకటిస్తేనే సరఫరా
- భవన నిర్మాణ కార్మికుల ఉపాధిపై ప్రభావం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిర్మాణ రంగాన్ని ఇసుక కొరత వెంటాడుతోంది. పది రోజులుగా ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఇసుక కొరత కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపు



తోంది. కొత్త ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటించే వరకు ఇసుక సరఫరాను పూర్తిగా నిలిపివేశారని బిల్డర్లు చెబుతున్నారు. నరసరావుపేటలో ఓ భవన నిర్మాణదారుడు శ్లాబ్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇనుము కూడా సిద్ధం చేశారు. శ్లాబ్ వేసేందుకు అన్ని సిద్ధం చేసుకున్నా ఇసుక సరఫరా కాకపోవడంతో పనులను నిలిపివేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మూతపడిన రీచ్‌లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక రీచ్‌లను మూసివేయించింది. తిరిగి ఆయా రీచ్‌లను ఎప్పటికి తెరుస్తారో తెలియక నిర్మాణదారులు ఆందోళనలో ఉన్నారు. ఇసుక కొరత నిర్మాణ రంగాన్ని దెబ్బతీసే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో లారీ రూ.36 వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 56 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటిలో సుమారు 20 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లేవు. అందుబాటులో 36 రీచ్‌లు ఉన్నాయి. వీటిని కూడా ప్రస్తుతం తాత్కాలికంగా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. రీచ్‌లను ప్రారంభిస్తేనే ఇసుక కొరత తీరేది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. కొరత మరికొన్ని రోజులు కొనసాగితే నిర్మాణ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. నిర్మాణ రంగంపైనే ఆధారపడి ప్రతి రోజు వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తుంటారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో చాలావరకు నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో పని ప్రాంతానికి వెళ్లినా ఇసుక అందుబాటులో లేక చేసేందుకు పని లేక కార్మికులు వెనుతిరగాల్సి వస్తోంది. పనులు లేకపోవడంతో సదరు కార్మిక కుటుంబాలు ఉపాధిని కోల్పోతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి నిర్మాణ పనుల్లో ఉపాధి పొందుతున్న కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇసుక కొరత సమస్య తీవ్ర రూపం దాల్చకముందే ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. కొత్త ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటిస్తుందని సమాచారం. అంటే అప్పటి వరకు ఇసుక సరఫరా ఉండదన్న ప్రచారం ఉంది. కొత్త ఇసుక పాలసీపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇసుక సమస్యను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని, తిరిగి నిర్మాణాలు ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్మాణ రంగదారులు, కార్మికులు కోరుతున్నారు.

నిలువెత్తు.. నిర్లక్ష్యం

- వైసీపీ నిర్వాకంతో నిలిచిపోయిన అంబేద్కర్ భవన్ నిర్మాణం
- రూ.5 కోట్లు కేటాయించిన నాటి ప్రభుత్వాలు
- దశాబ్దానికిపైగా వినియోగంలోకి రాని అంబేద్కర్ భవన్



2019లో నాటి మంత్రి ఆనందబాబు గ్రౌండ్‌ఫ్లోర్‌ను ప్రారంభించినట్లు ఉన్న శిలాఫలకం



మూత పడిన అంబేద్కర్ భవన్

గుంటూరు(విద్య), జూన్ 30: ప్రతి ప్రసంగంలోనూ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ మోత పుట్టించే మాజీ సీఎం వైఎస్ జగన్ ఆయా సామాజిక వర్గాలను ఉద్ధరించింది ఏమీ లేదు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం నగరం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ భవన్. గడిచిన అయిదు సంవత్సరాల్లో కనీసం ఒక్కపైసా కూడా దీని అభివృద్ధి కేటాయించ లేదు. తన నివాసం, పార్టీ కార్యాలయాల కోసం వందల కోట్లు వెచ్చించి ప్యాలెస్‌లు కట్టుకున్న నాటి సీఎం వైస్ జగన్.. ఎస్సీల పట్ల కపటప్రేమ చూపారు. దీనికి నిలువెత్తు నిదర్శనం అంబేద్కర్ భవన్ గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు కేటాయించిన నిధుల్ని దారి మళ్లించి నిర్మాణానికి తిలోదకాలు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దళితుల్లో చైతన్యం, అభివృద్ధే లక్ష్యంగా...

గుంటూరు నగరంలో దళిత సామాజిక వర్గాల చైతన్యం, అభివృద్ధి, సంక్షేమం కోసం నాటి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించి అమలు చేశారు. ఇందులో భాగంగా ఏసీకళాశాల ఎదురుగా అంబేద్కర్ భవన్ నిర్మించారు. దాదాపు నాలుగువేల చదరపు అడుగులుపైగా ఉన్న స్థలంలో భవనం నిర్మాంచారు. కాలక్రమేణ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో 2013లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న కన్నా లక్ష్మీనారాయణ నూతన భవనం కోసం శంకుస్థాపన చేసి భవన నిర్మాణాలు ప్రారంభిచారు. సెంట్రల్ ఏసీతో రెండు ఫ్లోర్స్ కోసం అప్పట్లోనే రూ.5కోట్లు అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం కేటాయించారు. తరువాత టీడీపీ ప్రభుత్వం నిర్మాణాలు కొనసాగించి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటుపై ఫ్లోర్ కొంతభాగం పూర్తి చేయించారు. తరువాత కొత్త రాజధాని నిర్మాణం, దాని భూసేకరణ, పోలవరం నిర్మాణం వంటి వాటిలో పడి అంబేద్కర్ భవన్ నిర్మాణంలో జాప్యం చేశారు. అప్పటికే గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తిచేసిన ఫ్లోరింగ్ పూర్తిచేశారు. మరో 25 నుంచి 30శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణాలను పూర్తిగా అటకెక్కించింది. గడిచిన అయిదు సంవత్సరాల్లో కనీసం ఒక్కపైసా కూడా చెల్లించదని సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీంతో నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి భవనం మరలా శిథిలావస్థలకు చేరుతోంది.

అంబేద్కర్ భవన్ ఘనకీర్తి...

నగరం నడిబొడ్డున ఏపీకళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్‌లో 500పైగా సీటింగ్ కెపాసిటి ఉంది. కళ్యాణ మండపంగా వాడుకునే వారు. అంతేకాకుండా అంబేద్కర్ భవన్‌పై భాగంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ శిక్షణ కోసం ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. నిరుద్యోగ ఎస్సీ, ఇతర సామాజిక వర్గాల యువతకు పోటీ పరీక్షల కోసం పెద్దమొత్తంలో నిధులు కేటాయించి శిక్షణ ఇచ్చేవారు. ఇక్కడ గ్రూపు 1, 2, 4 తోపాటు బ్యాంకు, స్టాఫ్‌సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు శిక్షణ పొందిన అనేకమంది నేడు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో భవనం శిథిలావస్థకు చేరడం నూతన భవన నిర్మాణం కోసం 2013లో ఏర్పాట్లు చేసినా ఇప్పటికి పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వమైనా అంబేద్కర్ భవన్ నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇక్కడ ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్‌ను ప్రస్తుతం వర్శిటీలో నిర్వహిస్తున్నారు. ఉద్యోగ ప్రకటనలు లేక నిధులు లేక ప్రస్తుతం అక్కడ ఉండీ ఉపయోగం లేన్నట్లుగా స్టడీ సర్కిల్ తయారైందని నిరుద్యోగయువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 1 జూలై 2024

లిటిల్ మాస్టర్ డైవర్

నీరంటే పిచ్చి... స్కూబా డైవింగ్ అంటే ఆసక్తి. అవే కైనా ఖరేకి ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన మాస్టర్ స్కూబా డైవర్‌గా గుర్తింపు తెచ్చిపెట్టాయి. సాహసాలకు వయసుతో పని లేదంటున్న ఈ పన్నెండేళ్ళ బెంగళూరు అమ్మాయి కథేమిటంటే...



"నీటి అడుగున నాకు ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. చెప్పడానికి అనేక విశేషాలున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీదు. వాతావరణం భయానకంగా ఉంటుంది, ఒక్కోసారి ఏదీ కనిపించదు. మనతో కలిసి డైవ్ చేసినవారు కనిపించకుండా పోవచ్చు. వాళ్ళకోసం వెతుకుతూ ఉండాలి. కొన్నిసార్లు చేపలు దాడి చేస్తాయి. "ఇంత రిస్క్ తీసుకొని, ఈ చిన్న వయసులో ఎందుకీ సాహసాలు?" అని ఎందరో అడుగుతూ ఉంటారు. "ఎందుకంటే... నీళ్ళంటే నాకు పిచ్చి. డైవింగ్ అంటే ఎనలేని ఆసక్తి. ఇక రిస్క్ అంటారా... రోడ్డు మీద నడిచి వెళ్తున్నప్పుడు కూడా ప్రమాదం జరగొచ్చు. అందరూ అన్ని వేళలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి" అని చెబుతుంది కైనా ఖరే. ఇటీవలే అండమాన్-నికోబార్‌లో 'మాస్టర్ స్కూబా డైవర్ సర్టిఫికేషన్ అందుకొని, అధికారికంగా 'మాస్టర్ డైవర్'గా గుర్తింపు పొందిన ఈ పన్నెండేళ్ళ అమ్మాయి స్వస్థలం బెంగళూరు. రెండేళ్ళ వయసులోనే కైనాకు ఆమె తల్లితండ్రులు స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు. 'కైనాను అందరూ 'వాటర్ బేబీ' అని పిలిచేవారు. మా అపార్ట్‌మెంట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతను ఆమెకు పరిచయం చేశాం. అందులో మంచి ప్రావీణ్యం సంపాదించింది. రెండేళ్ళ కిందట... తనకు పదేళ్ళ వయసులో... మా కుటుంబం అండమాన్-నికోబార్ దీవుల పర్యటనకు వెళ్ళినప్పుడు... స్కూబా డైవింగ్ పరిచయం అయింది. అప్పటి నుంచీ ఆమెకు అదే లోకంగా మారిపోయింది" అని చెప్పారు కైనా తల్లి అన్షుమ.



స్విమ్మింగ్ పూల్‌లో కాకుండా... సముద్రం జలాల్లో డైవ్ చెయ్యడం కాస్త భయంగానూ, సరదాగానూ అనిపించింది. స్కూబా డైవింగ్‌లో మరింత నైపుణ్యం కోసం ఇండోనేసియాలోని బాలిలో 'ఓపెన్ వాటర్ కోర్స్' చేశాను. అలాగే థాయిలాండ్‌లో 'అడ్వాన్స్‌డ్ ఓపెన్ వాటర్ కోర్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్ అందుకున్నాను" అని చెబుతున్న కైనా అండర్‌వాటర్ ఫొటోగ్రఫీ, స్పెషలైజ్డ్ నైట్రోక్స్ డైవింగ్, రెస్క్యూ డైవర్ ట్రైనింగ్... ఇలా అనేక అంశాల్లో శిక్షణ పొందింది. "ఇవేవీ సాధారణమైన అంశాలు కావు. కేవలం రెండేళ్ళలోనే వాటన్నిటిలో కైనా నిష్ణాతురాలై... అనుభవజ్ఞులైన స్కూబా డైవర్లను ఆశ్చర్యపరచింది. స్కూబా డైవింగ్‌లో కోర్సులు చేస్తానని కైనా చెప్పినప్పుడు... మొదట్లో మేము సంకోచించాం. కానీ ఆమె పట్టుదలను చూసి... ప్రోత్సహించాం" అంటారు అన్షుమ.

సవాళ్ళకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

స్కూబా డైవింగ్‌కు ఎంతో ధైర్యం, సమయస్ఫూర్తి కావాలి. భద్రతా ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలి. దానికి అనుగుణంగా కైమా తల్లితండ్రులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. "నేను అండమాన్-నికోబార్ దీవులతో పాటు బాలి, మాల్దీవులు, థాయిలాండ్... ఇలా ఎన్నో ప్రాంతాల్లో డైవింగ్ చేశాను. ప్రతి ప్రదేశానికీ తనదైన విశిష్టత ఉంది. నీటి అడుగున ఉండే పర్యావరణ వ్యవస్థలన్నా, జీవులన్నా నాకు చాలా ఇష్టం. అన్నిటిన్నా సముద్రపు తాబేళ్ళు నాకు ఫేవరెట్. అవి భారీగా, అద్భుతంగా ఉంటాయి" అని అంటోంది కైనా. స్కూబా డైవింగ్‌లో ఆమె ప్రతిభ... అధికారికంగా 'మాస్టర్ డైవర్ టైటిల్' అందుకొనేలా చేసింది. అసాధారణమైన పరిజ్ఞానం, అంకితభావం, నైపుణ్యం ఉన్నవారికి ఈ టైటిల్ ఇస్తారు. తద్వారా 'ప్రపంచంలో తక్కువ వయసున్న మహిళా మాస్టర్ స్కూబా డైవర్'గా గుర్తింపును సైతం కైనా సొంతం చేసుకుంది. "సముద్రంలో ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రత్యేకించి అండమాన్-నికోబార్ దీవుల్లో వాతావరణం భయపెడుతుంది. వర్షాలు, తుపాన్లు హఠాత్తుగా ముంచుకొస్తాయి. అలాంటి వాతావరణంలో ఒకసారి ఒక డైవర్ నీళ్ళలోకి దూకి అపస్మారక స్థితికి చేరాడు. నేను అతన్ని బోట్ వరకూ ఈడ్చుకువచ్చాను. ఆ సంఘటన ఇప్పటికీ గుర్తొస్తూ ఉంటుంది" అంటున్న కైనా "మెరైన్ సైన్స్ చదవాలనేది నా కోరిక. ప్రపంచంలో వీలైన ప్రతిచోటా స్కూబా డైవింగ్ చెయ్యాలన్నది నా కల" అని చెబుతోంది.



సెలబ్ షో

వరుస సినిమాలు లేవు. కానీ కెమెరా లెన్సులు ఎప్పుడూ ఆమెపై ఎక్కుపెట్టే ఉంటాయి. టీవీ షోలకు గెస్ట్‌గా... హోస్ట్‌గా... అన్నిటికీ మించి ఫిట్‌నెస్ గురూగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన బాలీవుడ్ నటి శిల్పాశెట్టి. 'నా మది నియంత్రణలో నేను లేను. నా ఆధీనంలో నా మనస్సు ఉంటుంది. ఇదే నా ఆనందమయ జీవనానికి కారణం' అంటున్న శిల్ప... యాభై ఏళ్ల వయసులోనూ తరగని అందం... మైమరిపించే రూపంతో ఆకట్టుకుంటోంది.



శిల్ప సౌందర్యం

"ఎంత పని ఒత్తిడి ఉన్నా, ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా, నన్ను మానసికంగా ఇంత దృఢంగా ఉంచుతున్నది భగవద్గీతలోని 'బంధురాత్మనస్తస్య యేనాత్మైవాత్మాన జితః... అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్' శ్లోకం. 'ఎవరైతే తమ మనస్సును జయిస్తారో అది వారికి మంచి మిత్రుడిగా ఉంటుంది. లేదంటే అదే వారికి శత్రువు అవుతుంది' అని దీని అర్థం. నా మనసు నా నియంత్రణలో ఉందని, దాని ఆధీనంలో నేను లేనని గుర్తు చేసుకోవడానికి రోజూ ఈ శ్లోకాన్ని బిగ్గరగా చదువుతా" అంటున్న శిల్ప క్రమం తప్పకుండా యోగా చేస్తుంది. క్లిష్టమైన యోగాసనాలతో కొన్ని వీడియోలు కూడా ఆమె విడుదల చేసింది. 'అలాగే శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి సంబంధం ఉంది. ప్రతి భావోద్వేగం శ్వాసతో ముడిపడి ఉంటుంది. ఒకవేళ మీరు శ్వాస లయను మార్చగలిగితే భావోద్వేగాన్ని కూడా మార్చవచ్చు' అంటుందీ బ్యూటీ.

'యోగా ప్రకారం శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి అనివార్యమైన సంబంధం ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి శ్వాస అతడి మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది. శ్వాస మీద నియంత్రణ గలవారు ప్రశాంత చిత్తంతో ఉండగలరు. ప్రాణాయామం లాంటి శ్వాస సంబంధిత ప్రక్రియలు ఒత్తిడిని తగ్గించి, భావోద్వేగాల సమతుల్యతకు దోహదపడతాయి. అదేవిధంగా పలు యోగాసనాల భంగిమలు కూడా శ్వాసతో ముడిపడినవే. గురువుల పర్యవేక్షణలో సాధన చేస్తే ఆనందమయమైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పొందగలుగుతారు'... అనేది శిల్ప మాట. యోగాను దైనందిన జీవితంలో భాగం చేయాలనుకొనేవారు... 'తొలుత సులువైన ఆసనాలతో ప్రారంభించి, క్రమంగా శరీరానికి అవసరమైనవాటిని సాధన చేస్తూ పోవాలి. వ్యాయామాలను ఏదో తప్పనిసరిగా చేస్తున్నట్టు కాకుండా... వాటిని ఆస్వాదిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి. వీటన్నిటితో పాటు పరిశుభ్రమైన సమతుల ఆహారం, జీవన శైలి కూడా ఎంతో ముఖ్యం. అప్పుడే మన శరీరం సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకొంటుంది' అంటోందీ భామ.

వర్కవుట్ ఇలా...

ఇటీవల శిల్పాశెట్టి ఇన్‌స్టాలో ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక రీల్ పోస్టు చేసింది. అందులో సులువైనదీ, ఇంట్లోనే చేసుకోదగినవి, ప్రభావవంతమైనవి, అద్భుతమైన ఫలితాలను ఇచ్చే ప్లాంక్స్ చేసి చూపించింది. వాటిల్లో ఆర్మ్ ప్లాంక్, సైడ్ ఎల్బో ప్లాంక్, ఎల్బో ప్లాంక్ ఉన్నాయి. రోజుకు 15-20 చొప్పున మూడు సెట్లు చేస్తే చేతులు, భుజాలు, నడుము దగ్గర కండరాలు బలపడతాయని, ఇవి కేవలం ఇరవై నిమిషాల్లో ముగించగల వ్యాయామాలని చెప్పింది శిల్ప. అలాగే సేతు బంధాసన, విశుద్ధి చక్ర, అర్ధహలాసన, నవాసనాలను రోజువారీ యోగా సాధనలో చేర్చుకొంటే అద్భుత ఫలితాలు ఉంటాయంటోంది.

- శిల్పాశెట్టి వర్కవుట్స్ యోగా, కార్డియో, వెయిట్స్ కాంబినేషన్‌తో ఉంటాయి. శరీరాన్ని దృఢంగా, అపురూపంగా తీర్చిదిద్దుకోవడానికి ఆమె తన శరీరానికి సరిపడే కొన్ని వ్యాయామాలతో ఫిట్‌నెస్ మెనూ రూపొందించుకుంది.
- రోజూ ఉదయం ముప్పై నుంచి నలభై నిమిషాలపాటు యోగా
- తరువాత రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో
- బిగువైన, బలమైన కండరాల కోసం వెయిట్‌లిఫ్టింగ్, స్క్వాట్స్, లంగెస్, పుషప్స్

ఇదీ మెనూ...

బిడ్డకు జన్మనిచ్చిన తరువాత కూడా శిల్పాశెట్టి శరీరాకృతిలో ఎలాంటి మార్పు రాలేదు. అందుకు ఆమె పాటించే వ్యాయామ, ఆహార నియమాలే ప్రధాన కారణం. మొదలుపెట్టి వదిలేసేవాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటారు. అలాంటివారికి భిన్నం శిల్ప. క్రమశిక్షణకు ఆమె అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఆమె మెనూలో పోషకాలు నిండిన సమతుల ఆహారం ఉంటుంది. జీవక్రియ చురుగ్గా ఉండటానికి ఒకేసారి కాకుండా చిన్న చిన్న విరామాల్లో కొద్ది మొత్తంలో తీసుకొంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు మెనూలో ఉంటాయి. ప్రాసెస్‌డ్, జంక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, ఇతర డ్రింక్స్‌కు పూర్తిగా దూరం. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడానికి తరచూ మంచినీళ్లు తాగుతుంది.

- ఉదయం 15 ఎంఎల్ అలోవెరా జ్యూస్, పది తులసి ఆకులు, బెల్లం, అల్లం జ్యూస్. తరువాత రెండు గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు.
- ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్‌లో మూడొంతుల నీళ్లు, ఒక వంతు పాలలో ఉడకబెట్టిన ఓట్స్/ మరగబెట్టిన పాలతో ముస్లీ/ వీట్ బ్రెడ్ టోస్ట్‌తో రెండు ఉడకబెట్టిన గుడ్లు, నానబెట్టిన బాదం.
- ఉదయం 9 గంటలకు బ్రౌన్ షుగర్‌తో టీ. గంట తరువాత బొప్పాయి, కర్బూజా, స్ట్రాబెర్రీ, నారింజ, ఐదు టేబుల్ స్పూన్ల యోగర్ట్ కలిపి ఒక బౌల్ నిండా ఫ్రూట్ సలాడ్.
- మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనంలో చికెన్/ గ్రిల్‌డ్ ఫిష్, ఉడకబెట్టిన కాయగూరలు, నెయ్యితో బ్రౌన్ రైస్. లేదంటే ఉడకబెట్టిన బీన్స్, ఒక పచ్చి క్యారెట్, రోస్టెడ్ జీరాతో గ్లాసు ఉప్పు వేసిన మజ్జిగ.
- సాయంత్ర స్నాక్స్‌లో వెరైటీలు మారుతుంటాయి. పది రోస్టెడ్ మఖానా, ఐదు అక్రోట్స్, కిస్మిస్.
- రాత్రి ఏడున్నరకు మిక్స్‌డ్ వెజిటబుల్/ చికెన్ సూప్‌తో పాటు టమాటో, మొలకలు, యాపిల్, చాట్ మసాల కలిపిన పాలకూర.
- డిన్నర్‌లో గ్రిల్‌డ్, ఫ్రైడ్ చికెన్‌తో ఉడకబెట్టిన కూరగాయలు. లేదంటే బీన్స్/ బ్రకోలీతో ఉడకబెట్టిన ఫిష్, ఒక క్యారెట్.

కురుల ఆరోగ్యానికి.. అలోవెరా!

న్యూట్రిన్లు, విటమిన్లు, అమినో ఆమ్లాలుండే అలోవెరా చర్మానికే కాదు జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఇంట్లోని పెరటిలో ఉండాల్సిన మొక్క ఇది. ఇంతకీ అలోవెరాతో హెయిర్ ప్యాక్స్ చేసుకోవటమెలా?

- అలోవెరా జెల్‌ను తలకు పట్టించుకుంటే.. జుట్టు రాలటం ఆగిపోతుంది. ముఖ్యంగా తలలో దురదలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చుండ్రు తగ్గిపోతుంది. మాడు చల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండున్నర స్పూన్ల కొబ్బరినూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే.. హెయిర్ డ్యామేజ్ కావటం ఆగిపోతుంది.





- రెండున్నర టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌కు.. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేయాలి. ఇలా పలుసార్లు చేస్తుంటే.. చుండ్రు పోతుంది. జుట్టు మిలమిలా మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతుల్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. హెయిర్ ప్యాక్ కోసం బౌల్‌లో మూడు స్పూన్ల అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి మెంతుల పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు పెరుగుతుంది.
- బౌల్‌లో అరకప్పు అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, ఒక కోడిగుడ్డు వేసి స్పూన్‌తో మెత్తటి పేస్ట్‌లో చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఎవడికోసం తగ్గాలి



వైవిధ్యమైన చిత్రాలు, పాత్రలతో కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు అల్లరి నరేశ్. ఆయన నటిస్తున్న 'బచ్చల మల్లి' చిత్రం గ్లింప్స్‌ను యూనిట్ ఆదివారం విడుదల చేసింది. ఈ వీడియోలో అల్లరి నరేశ్ పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. 'ఏయ్ ఎవడికోసం తగ్గాలి, ఎందుకోసం తగ్గాలి' అంటూ ఆవేశంగా ఆయన పలికిన సంభాషణలు, పోరాట ఘట్టాల్లో ప్రదర్శించిన నటన ఆకట్టుకుంది. అమృత అయ్యర్ ఈ చిత్రంలో కథానాయిక. సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, బలగం జయరాం, వైవా హర్ష కీలకపాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

అల్లరి నరేశ్‌తో సితార చిత్రం

అల్లరి నరేశ్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొత్త సినిమాను ప్రకటించింది. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమాపై ఆసక్తిని పెంచింది. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు పొందిన మెహర్‌తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఏఎన్ 63' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

సాహసనారి పాత్రలో...



ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌కు షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తుండగా, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా అవికాగోర్ నటిస్తున్నారు. ఆదివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్రంలో అవికా పోషించే పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం సాప్పని మాట్లాడుతూ "ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో అవికా సాహసోతమైన పనులు చేస్తూ, కథానాయకుడి లక్ష్య సాధనకు తోడ్పడే అమ్మాయి పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణలో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం" అని చెప్పారు. 'ఇదొక విభిన్న తరహా చిత్రం, కథానాయిక పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



నటి వరలక్ష్మీ శరత్‌కుమార్, వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్ పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. రేపు ముంబైలో వీరి వివాహం జరగనుంది. ముందస్తు పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను వరలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అభిమానులతో షేర్ చేసుకున్నారు.

టీమ్ ఇండియా గెలుపుతో భావోద్వేగానికి లోనయ్యా



క్రికెట్‌లో టీమ్ ఇండియా ఆటను నిరంతం సపోర్ట్ చేసే సినీ తారల్లో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఒకరు. శనివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా గెలవడంతో ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ఆనందాన్ని ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. "ఎన్నో ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ ట్రోఫీని ఇండియా ముద్దాడడంతో నా కళ్ల వెంట ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ఈ గెలుపు ఎప్పటికీ ప్రత్యేకమే. భారత్‌ను విశ్వవిజేతగా చూడటం మనందరికీ గర్వకారణం. భారత్ మాతా కీ జై..జై హింద్.." అని పేర్కొన్నారు. కాగా, తాను మ్యాచ్ చూస్తే ఇండియా ఓడిపోతుందని అమితాబ్ నమ్ముతారు. అందుకే శనివారం జరిగిన ఫైనల్‌ను కూడా చూడలేదని ఆయన చెప్పారు.



మిస్టర్ ఎక్స్ ముగించాడు

ఆర్య, గౌతమ్ కార్తిక్ హీరోలుగా మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. శరత్‌కుమార్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్‌కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. చివరి రోజు చిత్రీకరణకు సంబంధించిన స్టిల్స్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. అజర్ బైజాన్, జార్జియా, ఉగాండా దేశాల్లో పోరాట ఘట్టాలను తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ధిబు నినాన్ థామస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తన్వీర్ మీర్, ఎడిటింగ్: ప్రసన్న జీకే

కొత్త రోల్ కోసం రంగంలోకి



తనలోని నటికి సవాల్ విసిరే పాత్రల కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అలియా భట్. గ్లామర్ తారగానే కాదు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతున్నారు ఆమె. తాజాగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో ఆమె 'రా' ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. దీంతో తన పాత్ర కోసం అలియా సన్నాహాలు మొదలు పెట్టారు. జిమ్‌లో భారీ వర్కౌట్ సెషన్స్‌లో పాల్గొంటున్నారు. ఆదివారం కూడా జిమ్‌లో శ్రమిస్తున్నారు. ఈ చిత్రానికి శార్వరీ వాఘ్ దర్శకుడు. అలియా నటించిన జిగ్రా చిత్రం అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్ వార్' చిత్రంలో నటిస్తున్నారు.

ఘనంగా 'ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం



'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నందమూరి మోహన్ కృష్ణ, నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. 'బేబీ' చిత్రానికి గాను ఉత్తమ కథానాయకుడిగా ఆనంద్ దేవరకొండ, దర్శకుడిగా సాయిరాజేశ్ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ పేరిట ఇచ్చే ఈ పురస్కారాలను అందుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈసారి ఎన్టీఆర్ ఫిలిం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. మోహన్ కృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ అనే మూడక్షరాలు సంచలనానికి మారుపేరు, ఆయన కొడుగ్గా పుట్టడం ఏదో జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న కళావేదిక సంస్థకు నా అభినందనలు' అన్నారు. తెలుగు జాతి కోసమే పుట్టి, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసమే బతికిన వ్యక్తి తారక రామారావు గారు అని ముఖ్య అతిథిగా పాల్గొన్న నందమూరి మోహన రూప చెప్పారు.

నిబంధనలు విధిగా పాటించాలి

● విజిలెన్స్ ఎస్పీ కే ఈశ్వరరావు

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని విత్తన, ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు 2024-25 సీజన్‌లో వ్యాపార నిర్వహణలో కొన్ని నిబంధనలు విధిగా పాటించాలని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు సూచించారు. వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్సులు లేకుండా అమ్మకూడదు. విక్రయ లైసెన్స్‌లను అమ్మకపు కేంద్రం, గిడ్డంగిలోను ప్రదర్శించాలన్నారు. అమ్మకపు కేంద్రానికి వచ్చిన నిల్వలను స్టాకు రిజిస్టరులో నమోదు చేసిన తదుపరి మాత్రమే అమ్మకాలు ప్రారంభించాలని స్పష్టం చేశారు. అమ్మకపు కేంద్రంలో విక్రయానికి ఉంచిన విత్తన నిల్వలకు సంబంధించిన సోర్స్ ఆఫ్ సప్లై సర్టిఫికెట్లను సంబంధిత ఉత్పత్తిదారు, పంపిణీదారు నుంచి పొంది వుండాలన్నారు. అమ్మకపు కేంద్రంలో ఉంచిన పురుగుమందుల నిల్వలకు సంబంధించిన ప్రిన్సిపల్ సర్టిఫికెట్లను డీలర్ వద్ద ఉండాలన్నారు. డీలర్లు డిమాండ్ ఉన్న రకాలను కృత్రిమ కొరత సృష్టించ కూడదని చెప్పారు. డీలర్లు డిస్ట్రిబ్యూటర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేసి రైతులకు అమ్మకములను నిర్వహించవలెనన్నారు. స్టాక్ ప్యాకెట్లు, బస్తాలపై గరిష్ట అమ్మకపు ధరలకు మించి విక్రయించరాదు. రైతులు వారు కోరిన రకాలను మాత్రమే సరఫరా చేయవలెను. అలాకాక రైతుని మభ్యపెట్టి, వారి వద్దనున్న రకాలను అంటగట్టేందుకు ప్రయత్నించారన్నారు. రైతులకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

● విశ్రాంత ఐపీఎస్ దామోదర్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఐపీఎస్ దామోదర్, పాల్గొన్న ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, జూన్ 30: నేటి నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రాబోతున్న నూతన చట్టాలపై ప్రతిఒక్క పోలీస్‌కు అవగాహన ఉండాలని విశ్రాంత ఐపీఎస్ దామోదర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేటినుంచి అమలుకానున్న చట్టాల గురించి వివరించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాల గురించి, పాతచట్టలు-కొత్తచట్టాల మధ్య వ్యత్యాసాలు గురించి పోలీస్ అధికారులకు క్లుప్తంగా వివరించి, వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పరిధిలోని సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సీఐలు ఎస్ఐ, ఆపై స్థాయి అధికారులు, ఐటీకోర్ సీఐ మౌలాషరిఫ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం చంద్రబాబు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 30: ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.4 వేలు పెన్షన్ ఒకేసారి సీఎం నారా చంద్రబాబునాయుడుని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రూ.4 వేలతో పాటు ఏప్రిల్ నెల నుంచి అమలు చేస్తానన్న ప్రకారం రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు సోమవారం ఉదయం ఆరు గంటలకు అవ్వ తాతలకు ఇంటి వద్దనే ఇవ్వనున్నారని అన్నారు. ఒక ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా తానే పెన్షన్ అందించడం దేవ చరిత్రలోనే మొదటిసారి అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తానన్న రూ.3 వేలు పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు పెంచారని, అలా కాకుండా ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేలు పెన్షన్ చంద్రబాబునాయుడు ఒకేసారి పెంచారన్నారు.

నకిలీలపై ఉక్కుపాదం మోపాలి

● కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు అమ్మేవారికి పెనాల్టీ కాదు.. శిక్ష పడాలి
● అధికారుల తనిఖీలు, తీసుకున్న చర్యలు సంతృప్తికరంగా లేవు
● విజిలెన్సుతోపాటు శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకోవాలి
● ఫిర్యాదులకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
● కలెక్టర్, విజిలెన్సు ఎస్పీకి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు


సమీక్ష నిర్వహిస్తున్న పెమ్మసాని, పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు

గుంటూరు(తూర్పు)/గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదు. రైతులను నష్టాలపాలు చేసే నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందుల నివారణలో మీరు తీసుకున్న, తీసుకుంటున్న చర్యలేంటి? అంటూ వ్యవసాయ, విజిలెన్సు అధికారులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగు మందులు అమ్మేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయరంగ సమస్యలు, రైతుల ఇబ్బందులపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్లో ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పెమ్మసాని అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల బలహీనతలను ఆసరా చేసుకుని ధరలు పెంచేస్తున్నారని, సకాలంలో విత్తనాల శాంపిల్స్ పరీక్షలు జరపడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రత్యేకంగా ఒక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

డిస్‌ప్లే బోర్డులు ఎక్కడ?

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే షాపుల ముందు ధరలకు సంబంధించిన పట్టికల బోర్డులు ఎందుకు ఉంచడం లేదు? బ్రాండ్ల పేరుతో లోకల్ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను కొత్త ప్యాకింగులలో ప్యాక్ చేసి అమ్ముతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు? అంటూ అధికారులను నిలదీశారు. ఇకనుంచి ప్రతి షాపు ముందర డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయించండి. అవసరాలకు తగ్గట్టు ఎరువులు విత్తనాలు ఇవ్వకపోతే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయండి. ఆ ఫిర్యాదులకు పరిష్కారం చూపించే వరకు పని చేయాల్సిందే అంటూ పెమ్మసాని స్పష్టం చేశారు.

'నకిలీ' అనేది కనపడకూడదు

జిల్లాలో చాలాకాలంగా కల్తీ ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్న వారిపై సోదాలు జరుగుతున్నాయి తప్ప చర్యలు తీసుకోవడం లేదని, గతంలో నమోదు చేసిన కేసుల వివరాలు ఇప్పటిదాకా ఎందుకు తేల్చలేదని పెమ్మసాని ప్రశ్నించారు. విజిలెన్సు అధికారులు గుర్తించిన సమస్యలపై కేసుల వివరాలు తెలియజేయాలన్నారు. 40 రోజుల్లో పద్ధతులు మార్చుకోకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేయండి. అధికారులు ఇచ్చే కౌలు రైతుల గణాంకాలను బట్టే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత లభిస్తుంది కాబట్టి అర్హులను చూసి జాగ్రత్తగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. బోగస్ సర్టిఫికెట్లను ఉపయోగించుకుని వ్యవసాయశాఖలో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగులను గత టీడీపీ ప్రభుత్వం సర్వీస్ నుంచి తొలగించింది. కానీ అందులో కొందరు వైసీపీ ప్రభుత్వం వచ్చాక తిరిగి వీధుల్లో చేరారు. ఆ పూర్తి వివరాలు వెలికి తీయండి. నాగార్జునసాగర్, గుంటూరు ఛానల్, కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి గుంటూరు పార్లమెంటు పరిధిలోని పంటలకు అందుతున్న నీటిపారుదల విధానాలను అధికారుల ద్వారా ఆయన అడిగి తెలుసుకున్నారు. అవసరాలను బట్టి ఆయా నీటి మార్గాలలో మరమ్మతులు చేపట్టి సాగునీరు పారుదలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని జలవనరులశాఖ అధికారులు, కలెక్టర్ నాగలక్ష్మికి పెమ్మసాని సూచనలు ఇచ్చారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోయినా, ఇచ్చిన మాటకు కట్టుబడి పించన్లు అందజేస్తున్న ముఖ్యమంత్రికి తాను ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని పెమ్మసాని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, విజిలెన్స్ ఎస్పీ కే ఈశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి గాలి దేముడు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, లాంఫారం ఏడీఆర్ దుర్గాప్రసాద్, అధికారులు కేవీవీ సత్యనారాయణ, శేషశ్రీ, రాజకుమారి, మహిపాల్‌రెడ్డి, రాజబాబు పాల్గొన్నారు.

స్థలం తిరిగి ఇవ్వకపోతే ఆత్మాహుతి చేసుకుంటాం

● విడదల రజిని కుటుంబసభ్యులపై పురుషోత్తమపట్నం వాసుల హెచ్చరిక


తమకు న్యాయం చేయాలని కోరుతున్న పురుషోత్తమపట్నం వాసులు

చిలకలూరిపేట, జూన్30: చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలోని పురుషోత్తమపట్నం పరిధిలో ఉన్న తమ స్థలాన్ని మాజీ మంత్రి విడదల రజిని కుటుంబసభ్యులు కబ్జా చేశారని అదే గ్రామానికి చెందిన మా ర్కెట్ యార్డు మాజీచైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు, బత్తినేని మహాలక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం ఆరోపించారు. సుమారు ఎకరంన్నర స్థలం బత్తినేని వంశీకులకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులదని వారు తెలిపారు. వైసీపీ అధికారంలో ఉండగా తమను బెదిరించి ఆ స్థలాన్ని విడదల రజిని మామ విడదల లక్ష్మీనారాయణ ఆక్రమిం చుకున్నారని వారు ఆరోపించారు. ఆ స్థలంలో స్వాతంత్ర్య సమర యోధులైన తమ కుటుంబీకుల సమాధులు కూడా ఉన్నాయని, వాటిని కూడా తొలగించారన్నారు. తమ స్థలాన్ని తమకు స్వాధీనం చేయక పోతే పురుషోత్తమపట్నం లోనే ఉండే రజినీ మామ విడదల లక్ష్మీనారాయణ ఇంటి ముందు ఆత్మహుతి చేసుకుంటామని వారు హెచ్చరించారు. వైసీపీ హయాం లో విడదల రజిని కుటుంబ స భ్యులు చేసిన అరాచకాలు, భూ కబ్జాల పై నివేదిక తయారు చేస్తున్నట్టు వారు తెలిపారు. ఈ వివరాలను సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు అందజేయనున్నట్టు వారు తెలిపారు.

నేడు పెన్షన్ల పంపిణీ

మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, జూన్ 30: ఎన్నికల హామీల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా వెయ్యి రూపాయలు పెంచి రూ.4వేలు అందించనున్నారని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేడు పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నామని పేర్కొన్నారు. రూ.4వేలు పెన్షన్‌లతో పాటు నెలకు వెయ్యి రూపాయల చొప్పున రూ.3వేలు కలిపి రూ.7వేలు పింఛన్ అందించనున్నట్లు తెలిపారు. తొలుత రేపల్లె మండలం పేటేరులో ఉదయం 9.30గంటలకు పెన్షన్‌ల పంపిణీని మంత్రి అనగాని ప్రారంభించనున్నారు. అనంతరం పట్టణంలోని 13వవార్డులో నిజాంపట్నం జల్సాబజారులో, నగరం మండలం చిన్నమట్లపూడిలో, చెరుకపల్లి మండలం నడింపల్లిలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం జరగనున్నది. రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుతుందని తెలిపారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఇప్పటికే దృష్టిసారించామని ఒక్కొక్క సమస్యను పరిష్కరించే విధంగా ముందుకు వెళ్ళనున్నట్లు తెలిపారు.

సీజీఎస్‌టీ భవన్‌కు త్రివర్ణ వెలుగులు

● నేడు జీఎస్‌టీ డే కార్యక్రమం... పలువురికి ప్రశంసాపత్రాలు


త్రివర్ణ విద్యుత్ వెలుగుల్లో సీజీఎస్‌టీ భవన్

గుంటూరు, జూన్ 30: సెంట్రల్ జీఎస్‌టీ అధికారులు సోమవారం 8వ జీఎస్‌టీ డే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా కన్నావారితోటలోనున్న సీజీఎస్‌టీ భవన్‌కు త్రివర్ణ పతాక రంగులతో కూడిన విద్యుత్ వెలుగులతో కొత్త శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జీటీ రోడ్డులోని టుబాకో అసోసియేషన్ హాల్లో జీఎస్‌టీ డే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి డీఆర్ఎం ఎం.రామకృష్ణ, టుబాకో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు హాజరై ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు ప్రశంసాప్రతాలను అందజేయనున్నట్లు తెలిపారు.

ఖాకీ.. కాఠిన్యం

● తమ కుమార్తెను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేస్తే బాధితులపైనే హత్య కేసు
● ఓ మంత్రి అండదండలతో చెలరేగిన నిందితులు, పోలీసులు, వైద్యులు
● అభం, శుభం తెలియని యువతి మృతి
● రెండేళ్ల కిందట ఘటన.. న్యాయం చేయాలంటున్న బాధితులు



తల్లిదండ్రులతో మృతురాలు జనని, జనని మృతదేహం (ఫైల్)

గుంటూరు, జూన్ 30: రెండేళ్ల కిందట జరిగిన ఈ ఘటన పోలీసుల అరాచకానికి పరాకాష్టగా నిలిచింది. బాధితులు తమకు న్యా యం చేయాలంటూ జాతీయమహిళా కమిష న్‌ను ఆశ్రయించారు. దీనిపై నివేదిక ఇవ్వాలంటూ మహిళా కమిషన్ జిల్లా ఎస్పీని ఆదేశించింది. మరోవైపు తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఇప్పటికే డీజీపీ, ఐజీ, ఎస్పీ తదితర ఉన్నతాధికారులందరికీ మొరపెట్టుకున్నారు.

ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. గుంటూరులోని పలకలూరు రోడ్డులో గల రత్నగిరినగర్‌కు చెందిన నిశ్శంకర సుబ్బారావు, శంకరలీల దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వారికి ఒక్కగానొక్క సంతానం జనని(21) డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. వీరి ఇంటికి సమీపంలో బండారు ఆనంద్ నాలుగు నెలలుగా తన మేనమామ ఇంట్లో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. కాగా జనని కళాశాలకు వెళ్లి వచ్చే క్రమంలో ఆటో ఎక్కిన సమయంలో ఆనంద్ ఆమెను ట్రాప్ చేశాడు. ఈ క్రమంలో 2022 జూలై 4న ఆమెను ప్రేమ పేరుతో తనతో తీసుకెళ్లిపోయాడు. దీంతో జనని తల్లిదండ్రులు అదే రోజు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆనంద్‌పై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. పైగా బాధితులనే స్టేషన్‌లో కూర్చోపెట్టి బెదిరించారు. ఆ విధంగా రెండు రోజుల పాటు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పడంతో ఆ తల్లిదండ్రులు ఆందోళనకు గురై అదే నెల 11న ఎస్పీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. అలా ఫిర్యాదు చేశారని అప్పటి సీఐ బత్తుల శ్రీనివాసరావు మా పైన ఎస్పీకి ఫిర్యాదు చేస్తారా అంటూ పరుష పదజాలంతో బెదిరింపులకు దిగారు. వారు ఇరువురిని అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు.

మెజిస్ట్రేట్ ఎదుట హాజరు..

రిమాండ్ రిపోర్టును చూసి సంబంధిత న్యాయమూర్తి అవాక్కయ్యారు. ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లను చూసి ఎవరు ఎవరిని చంపారు, చనిపోయింది ఎవరు? పోస్టుమార్టం చేశారా, పంచనామా జరిగిందా, సాక్షులను విచారించారా వాటన్నింటి తాలూకు రికార్డు ఏదైనా ఉందా అంటూ ప్రశ్నించారు. ఆ కేసులో వల్లెపు అంకలక్ష్మి అనే మహిళ తనను కందుకూరి ఓంకారమ్మ, కందుకూరి గోపి, శంకర లీల, సుబ్బారావు మరికొందరు చంపుతామని బెదిరించారని, తాము భయంతో పెద్దగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చేసరికి నిందితులు పారిపోయారని, తమను చంపడానికి ప్రయత్నించిన వారిపె చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఏకంగా వ్యక్తిని చంపినట్లుగా సెక్షన్ 302 నమోదు చేయడంతో ఆశ్చర్యపోయారు. మేజిస్ట్రేట్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎస్ఐ ఆ ఇరువురు దంపతులను వెనక్కి తీసుకొచ్చేశారు. వారివురిని స్టేషన్ కు తీసుకువెళ్లి అర్ధరాత్రి వరకు ఉంచి బెదిరించి పంపారు. బలవంతంగా వారితో సంతకాలు చేయించుకున్నారు. దీనిపై బాధిత యువతి మేనమామ గోపీనాథ్ ఆన్‌లైన్‌లో పరిశీలించగా తమపై హత్య కేసు నమోదు అయినట్లు గుర్తించి నిర్ఘాంత పోయారు. అయితే అప్పటికే వారి కుమార్తె నిందితులు వద్ద ఉండడంతో ఆమెకు ఏదైనా హాని తలపెడతారనే భయంతో తమపై హత్య కేసు నమోదు చేసిన విషయాన్ని బయటకు చెప్పలేకపోయారు.

ఇదిలా ఉంటే జనని యోగక్షేమాలు తెలియక కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో జనని గర్భం దాల్చిందని తెలుసుకొని 2023 ఏప్రిల్ 8న పెద్దమ్మ ఓంకారమ్మ సాతులూరు వెళ్ళింది. అయితే అక్కడ ఓంకారమ్మను జననితో కలనివ్వకుండా భర్త ఆనంద్, అతని సోదరులు అరవింద్, అజిత్‌లు ఓంకారమ్మపై దాడి చేసి కొట్టి గాయపరిచారు.

అమ్మాయికి సీరియస్ గా ఉందంటూ ఫోన్..

కాగా తమ కుమార్తెను పురుడు పోసుందుకు పుట్టింటికి పంపాలంటూ తల్లిదండ్రులు అనేకసార్లు ప్రాధేయపడ్డారు. అయితే భర్త ఆనంద్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు ససేమిరా అన్నారు. ఇదిలా ఉంటే 2023 సెప్టెంబర్ 17న జనని కుటుంబ సభ్యులకు భర్త ఆనంద్ తాలూకు వ్యక్తి ఫోన్ చేసి మీ అమ్మాయికి సీరియస్‌గా ఉందని జీజీహెచ్‌లో చేర్పించామని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఆందోళనతో ఆమె కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు వెళ్లగా అప్పటికే జనని కన్నుమూసింది. జనని మృతిపై కుటుంబ సభ్యులకు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ అదే నెల 29న జిల్లా కలెక్టర్‌ను కలిసి సమగ్ర విచారణ జరపాలని, ఇందులో వైద్యులు మృతికి దారి తీసిన కారణాలను దాచిపెడుతున్నారని ఫిర్యాదు చేశారు. జనని మృతిపై ఓ కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపి తనకు నివేదిక పంపాలంటూ కలెక్టర్ ఆదేశించారు. గత నెల 15 జీజీహెచ్ నుంచి విచారణ కమిటీ సభ్యులు జనని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విచారణకు రావాలని చెప్పారు. దీంతో బాధితులు వద్ద ఉన్న ఆధారాలను సమర్పించి జనని చనిపోవడానికి దారి తీసిన కారణాలు, తమకు ఉన్న అనుమానాలను వ్యక్తం చేశారు.

వైద్య బృందం విచారణలో మృతి కారణాలు వెల్లడి

జీజీహెచ్ వైద్య బృందం జరిపిన దర్యాప్తులో జనని మృతికి అసలు కారణాలు వెల్లడయ్యాయి. సెప్టెంబర్ 17న జనని చావుబతుకుల మధ్య ప్రాణాపాయ స్థితిలో ఉండగా జీజీహెచ్‌కు తీసుకొచ్చినట్లు వైద్యులు గుర్తించారు. అంతేగాక దానికి మూడు రోజులు ముందు అంటే 14వ తేదీనే ఆమెను ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు జనినికి స్కానింగ్ చేయాలని, పరిస్థితి విషమంగా ఉందని తక్షణం ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని వైద్యులు సూచించారు. అయితే వైద్యుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఆమెను ఆసుపత్రిలో అడ్మిట్ చేయకుండా తీసుకెళ్లిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమెకు సరైన వైద్య సదుపాయం అందని కారణంగానే ఆమె చనిపోయినట్లు వైద్యులు కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. అయితే జనని మృతిపై పోలీసులు అనుమానాస్పద మృతి సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే ఆమె ప్రాణాలు కోల్పోయిందని, ఆ ప్రకారం ఆమె భర్త, ఇరువురు సోదరులు, తల్లిదండ్రులు, మేనత్త మేనమామలను నిందితులుగా చేరుస్తూ సెక్షన్ ఆల్టర్ చేయాలని బాధితులు కోరుతుంటే పోలీసుల నుంచి స్పందన లేదు.

ఓ మాజీ మంత్రి అండదండలతోనే యువతి బలి

ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ మాజీ మంత్రి అండదండలు ఉన్నట్లు మొదటి నుంచి బాధితులు ఆరోపిస్తున్నారు. హత్య జరగకపోయినా హత్య జరిగిందని కేసు నమోదు చేసే ధైర్యం ఓ మంత్రి అండదండల వల్లే వచ్చిందని బాధితుల ఆరోపిస్తున్నారు. అంతేకాక బాధితురాలు ప్రాణాపాయ స్థితిలో ఉందని వైద్యులు హెచ్చరించినా ఆసుపత్రిలో అడ్మిట్ చేయకపోవడం, చనిపోయిన తర్వాత కూడా ఎమ్మెల్సీ చేయకుండా బుకాయించడం, అప్పటి సూపరింటెండెంట్ ఒత్తిడి మేరకు తప్పని పరిస్థితుల్లో ఎమ్మెల్సీ చేయడం, ఆ తరువాత కలెక్టర్ రెండు దఫాలు హెచ్చరించినా సరైన నివేదిక ఇవ్వకపోవడం వీటన్నింటి వెనక అప్పటి మంత్రి అండదండలు ఉన్నాయని బలంగా ఆరోపణలు వస్తున్నాయి. తమ కుమార్తె కిడ్నాప్ అయింది అని తాము పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు చట్ట ప్రకారం వ్యవహరించి ఉన్నట్లయితే తమ కుమార్తె ఈరోజు ప్రాణాలతో ఉండేదని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. తమ పై నమోదైన తప్పుడు హత్య కేసును తొలగించడం, అదేవిధంగా తమ కుమార్తె మరణానికి కారణమైన వారిని నిందితులుగా చేర్చి సెక్షన్‌లు ఆల్టర్ చేసే విషయంపై బాధితులు నేటికీ పోరాడుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా వారికి న్యాయం జరుగుతుందో లేదో చూడాలి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

కోనూరులో సాయిరామ్ అంత్యక్రియలు

● నివాళులర్పించిన టీడీపీ నేతలు
● లండన్ బీచ్‌లో గల్లంతై మృత్యువాత


కోనూరులో సాయిరామ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అచ్చంపేట, జూన్ 30: మండలంలోని కోనూరు గ్రామానికి చెం దిన గుంటుపల్లి సాయిరామ్ మృతదేహానికి తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. గుంటుపల్లి సాయిరామ్ ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్ళి జూన్ 2వ తేదీన ప్రమాదవశాత్తు బీచ్‌లో పడి మరణించాడు. ఆయన మృతదేహం కోసం కోనూరులో బంధువులు ఎదురుచూ స్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం కలుగచేసు కొని మృతదేహాన్ని కోనూరుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు, ఎంపీ కృష్ణదేవరాయలకు కృతజ్ఞతలు తెలియజే శారు. పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, గన్న వరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు విదేశాల్లో ఉన్న వారి బంధు వులతో మాట్లాడి మృతుని కుటుంబాన్ని ఆదుకొని మృతదేహం తరలించేందుకు ఏర్పాటుచేశారని తెలిపారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌కు మృతుని బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. సాయిరామ్ అంత్యక్రియలు ఆదివారం కోనూరులో జరిగాయి. నివాళులర్పించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, వెనిగండ్ల కోటయ్య జీ అచ్యుత రామారావు, పూర్ణచంద్రరావు, ఆవుల గురునాథం, జనసేన మండల అధ్యక్షుడు మట్టం వీరభద్రరావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు పింఛన్‌ల పంపిణీ

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పెదకూరపాడు, జూన్ 30 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సోమవారం మొదటిసారిగా సచివాలయ అధికారులు, సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేయనున్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో 11 రకాలకు చెందిన పింఛన్‌లు 40,264 మంది లబ్ధిదారులకు సచివాలయ అధికారులు, సిబ్బంది పంపిణీ చేయనున్నారు.

కొందరికి రెండింతలు.. మరి కొందరికి మూడు రెట్లు

వృద్ధులు, వితంతువులు, చేనేత, చర్మకారులు, ఒంటరి మహిళలు, కల్లు గీతకార్మికులు, డప్పు కళాకారులు, హెచ్‌ఐవీ బాధితులు, హిజ్రాలు, కళాకారులకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలతో పాటు ముందుగా ఇచ్చిన హామీ మేరకు మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలకు మొత్తం రూ.7వేలు ఇవ్వనున్నారు. దివ్యాంగులు, కుష్టు బాధితులకు రూ.3వేలు నుంచి రూ .6 వేలు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి, డయాలసిస్ ఇతరత్రా బాధితులకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలు అందజేస్తారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేలు నుంచి రూ .15 వేలు వరకు ఇవ్వనునాన్నారు.

నియోజక వర్గంలో మండలాల వారీగా పింఛన్‌దారులు..

పెదకూరపాడు నియోజకవర్గంలో మండలాలవారీగా పింఛన్ పొందనున్న వారి సంఖ్య ఇలా ఉంది. అచ్చంపేట మండలంలో 9,045 మంది, అమరావతి మండలంలో 10,175, క్రోసూరు మండలంలో 8,828, పెదకూరపాడు మండలంలో 7,886, బెల్లంకొండ మండలంలో 4,330 మంది మొత్తంగా 40,264 మంది పింఛన్‌లను పొందనున్నారు.

లబ్ధిదారుల్లో ఆనందం.. పింఛన్ పెంపుతో పాటు మూడు నెలలకు కలిపి రూ.7వేలు పింఛన్‌ను లబ్ధిదారులకు ఇవ్వనుండటంతో పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది వృద్ధులకు, అభాగ్యులకు కూటమి ప్రభుత్వం ఇవ్వనున్న పింఛన్ ఎంతో భరోసాను ఇస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెదకూరపాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులు, పార్టీ నేతలతో కలసి పింఛన్లను పంపిణీ చేస్తారు.

అమరావతి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా ప్రతి పెన్షన్‌దారునికి రూ.4వేలు పెన్షన్‌తో పాటు ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్ నగదు రూ.1000 కలిపి సోమవారం పంపిణీ చేయను న్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని 10,126 మంది పెన్షన్ దారులకు సోమవారం సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లికి వెళ్లి రూ.6.92 కోట్లు పింఛన్ నగదును పంపిణీ చేయనున్నారు.

దాచేపల్లి: గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు సోమవారం దాచేపల్లి పట్టణానికి రానున్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో యరపతినేని ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నారు. దాచేపల్లి రూరల్‌లో 5,958 మంది లబ్దిదారులకు రూ.4 కోట్ల 9 లక్షల 65 వేలు అందజేయనున్నారు. అదేవిధంగా పట్టణంలో 4,505 మంది లబ్దిదారులకు రూ.3 కోట్ల 88 లక్షల 87 వేల 500 అందజేయనున్నారు. దాచేపల్లిలోని 10వ వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని హాజరుకానున్నారు. అనంతరం విజయభాస్కర కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బిజెపిల సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రసంగించనున్నారు. అంతేకాకుండా గ్రామాల వారీగా, వార్డుల వారీగా సమీక్షా సమావేశం జరుగనున్నది.

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణంలోని 9, 17, 19, 25, 26, 27 వార్డులలో పలువురి లబ్ధిదారులకు యరపతినేని పింఛన్ అందజేసి పంపిణీని ప్రారంభించనున్నట్లు పార్టీ నాయకులు పాండురంగ శ్రీను, బెల్లంకొండ భద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సత్తెనపల్లి: నియోజక వర్గంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీని సచివాలయ సిబ్బంది చేపట్టనున్నారు. ముప్పాళ్ళ మండలంలో మొత్తం 6,315 మందికి, నకరికల్లు మండలంలో 9,704, రాజుపాలెం మండలంలో 7,106, సత్తెనపల్లి మండలంలో 10,956, సత్తెనపల్లి పట్టణంలో 6,478 మందికి ఇంటింటికి వెళ్ళి పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

నేడు చౌడేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల, జూన్ 30: మండల కేంద్రమైన రెంటచింతలలో వేంచేసియున్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 9 గంటలకు హోమం, 10 గంటలకు బోనాల సమర్పణ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహించనున్నారు.

ఎంఈవో నాగయ్యకు సన్మానం

మాచర్లటౌన్, జూన్ 30: మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యాన మాచర్ల ఎంఈవో వేముల నాగయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. నాగయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో భాగంగా ఆయనను ఉపాధ్యాయులు దుశ్శాలువలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో గాదె కిరీటిరెడ్డి, మోరా భాస్కరరెడ్డి, జల్లా శ్రీనివాసరావు, జక్కిరెడ్డి చిన్నపురెడ్డి, తుమ్మా మల్రెడ్డి, విజయలక్ష్మి పండిట్, కసిరెడ్డి శాంతిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

పద్మశాలి సంఘ నియోజక వర్గ కమిటీ ఎన్నిక

● నూతన అధ్యక్షుడిగా చెన్నంశెట్టి బాజీ

పెదకూరపాడు, జూన్ 30 : మండలంలోని లగడపాడులో ఆదివారం పెదకూరపాడు నియోజకవర్గ పద్మశాలి సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెదకూరపాడుకు చెందిన చెన్నంశెట్టి బాజీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కాకుమాను రమేష్, ప్రధాన కార్యదర్శి చిల్లపల్లి సత్యంలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నూతన అధ్యక్షుడు బాజీ మాట్లాడుతూ చేనేత రంగంలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా బాజీని సంఘ సభ్యులు శాలువాలతో, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోలి యలమంద, అనుముల వెంకటరావు, నక్కా మల్లికార్జునరావు, బండారు వెంకటేశ్వర్లు, అనుముల సామ్రాజ్యం, కాటాబత్తిని శ్రీనివాస రావు, పణిదరపు బ్రహ్మం, నందం సాయి, జిల్లా శ్రీనివాసరావు, నంద్యాల వేణు, చిల్లపల్లి పానయ్య, అనుముల ప్రసాదు, సందెపు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పండుగను జయప్రదం చేయండి

● వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి ఊసేలేదు
● మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
● వెల్దుర్తిలో పింఛన్లు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే
● పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు



మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, జూన్ 30: నేడు నిర్వహించే పింఛన్ల పండుగను పార్టీ నేతలు, కార్యకర్తలు దగ్గరుండి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆదివారం పాలువాయి జంక్షన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రూ.3000 పింఛన్‌ను రూ.4000కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంకా మూడు నెలలకు సంబంధించిన బకాయిలనూ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇప్పటివరకు వైసీపీ అరాచకాలతో రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభి వృద్ధి రెండు కళ్లుగా పాలన పరుగెడుతుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాన్ని విస్మరించి, మూడు రాజధానుల పేరుతో ప్రజలను మభ్యపెట్టి చివరకు ఏ రాజధాని లేకుండా చేసిన జగన్ రెడ్డి వైసీపీ గడిచిన ఎన్నికల్లో ప్రజల తీర్పుతో చావుదెబ్బతిని చివరకు 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదాను సైతం కోల్పోయిందని ఎద్దేవా చేశారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి హింస, దోపిడీ, దౌర్జన్యాలతో పాలన సాగిందని ఎక్కడా ఒక్క అభివృద్ధి పని చేపట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. ప్రభుత్వం మారిందని, పాలన కూడా మారుతోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు.

పింఛన్లు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్ : మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తన స్వగ్రామమైన మండల కేంద్రమైన వెల్దుర్తిలో సోమవారం ఉదయం 6 గంటలకు పెంచిన పింఛన్లను ఎన్టీఆర్ భరోసాపేరుతో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెరిగిన పింఛన్ రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మరో రూ.3 వేలు కలిపి మొత్తంగా రూ.7వేలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నేరుగా అందించనున్నారు. అనంతరం మాచర్ల పట్టణంలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో, పట్టణాల్లో సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు.

రైతు సేవా కేంద్రాలుగా ఆర్బీకేలు

రెంటచింతల, జూన్ 30: డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్బీకేల వద్ద నవరత్నాలు, ఆర్బీకే లోగోలను కూడా తొలగించామన్నారు. ఆర్బీకేలోని కియోస్కోప్‌లు, సాఫ్ట్ వేర్ యాప్‌ల్లో చిత్రీకరించిన వాటితో పాటు మాజీ సీఎం జగన్ ఫోటో తొలగించి సీఎం నారా చంద్రబాబునాయుడు ఫోటోను అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలు వచ్చాయని ఆయన తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో నేడు గ్రీవెన్స్

అచ్చంపేట, జూన్ 30 : మండల కేంద్రమైన అచ్చంపేటలో సోమవారం సీఐ కాలేషావలి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు అచ్చంపేట పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు ఎస్ఐ అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు.



వెంకట్రావు దంపతులను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ఉద్యోగ విరమణ పొందిన వారికి సత్కారం

అమరావతి, జూన్ 30: మండల పరిధిలో హౌసింగ్ డీఈగా పని చేసిన ఎస్.సూర్యభగవాన్, తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కే.వెంకట్రావులు ఆదివారం ఉద్యోగవిరమణ చేశారు. ఈ మేరకు వేర్వేరు కార్యక్రమాలుగా వారికి ఆయా కార్యాలయ అధికారులు, సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యభగవాన్ దంపతులను, వెంకట్రావు దంపతులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమాలలో హౌసింగ్ శాఖ పీడీ వేణుగోపాలరావు, ఈఈ శివలింగం, ఏఇలు పాల్గొనగా వెంకట్రావు వీడ్కోలు సభలో తహశీల్దార్ వెంకటరమణారావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వెంకటరత్నం, విశ్రాంత తహసీల్దార్‌లు భాస్కరరావు, సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రన్న

సత్తెనపల్లి, జూన్30: ఎన్నికల ముందు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు, టీడీపీ నేత కంభాల వెంకటేశ్వరరావులు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పేరుతో ఇచ్చిన హామీని స్వయంగా చంద్రబాబు నాయుడు పంపిణీ చేయటానికి సిద్ధమయ్యారన్నారు. లబ్ధిదారుల తరుపున సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సోమవారం పండుగ వాతావరణంలా పింఛన్ల పంపిణీ జరగనుందన్నారు.

రాజుపాలెం: దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా పెన్షనర్లకు ఒకే సారి రూ.7 వేలు అందజేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 1వ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం హోదాలో నారా చంద్రబాబునాయుడు పాల్గొనటం శుభ పరిణామ న్నారు. గత ప్రభుత్వంలో 1వ తేదీన పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వటానికి ఇబ్బందులు పడిన పరిస్థితిని ఈసందర్భంగా ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టనుందని పెద్దిరాజు అన్నారు.



ప్రత్యేక పూజల్లో జేసీ శ్యాంప్రసాద్ దంపతులు

అమ్మవారిని దర్శించుకున్న జేసీ దంపతులు

దుర్గి, జూన్ 30: మండలంలోని అడిగొప్పుల గ్రామ శివారులో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ పూజారులు అమ్మవారి మహిమలు గురించి వివరించారు. అనంతరం జేసీ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామాలు

● అప్రకటిత విద్యుత్ కోతలపై విమర్శలు గుప్పిస్తున్న ప్రజలు
● విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

నకరికల్లు, జూన్ 30 : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచపోగా ఆదివారం తెల్లవారుజాముకు గానీ పునరుద్ధరణ జరగలేదు. కుంకలగుంట, పాపిశెట్టిపాలెం, జల్లాపేత, నకరికల్లు గ్రామాలు శనివారం రాత్రి అంధకారంలో ఉండిపోయాయి. మరమ్మతుల పేరుతో ప్రతి శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని, కానీ ప్రతిరోజు రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధిస్తున్నారని, నకరికల్లు మండలంలో ఎక్కువగా ఈ పరిస్థితి ఉందని వినియోగ దారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల తరచూ అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంపై గ్రామాల్లోని వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వినియోగ దారులు కోరుతున్నారు.

తాళ్లపల్లి సర్పంచ్‌గా బ్రహ్మానాయుడు

మాచర్ల రూరల్, జూన్ 30: మండలంలోని తాళ్లపల్లి సర్పంచ్‌గా పసుపులేటి బ్రహ్మానాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సర్పంచ్‌గా విధులు నిర్వహించిన యంత్ర గాలయ్య సెలవుపై వెళ్లడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న బ్రహ్మానాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి వెంకట్రామయ్య ఆదివారం బ్రహ్మానాయుడుతో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు పలువురు బ్రహ్మానాయుడుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మద్దిగపు వెంకట్రామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ గుండాల శ్రీనివాసరావు, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, తోటకూర పరమేశ్వరరావు, బృంగా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగూరికి ఆర్యవైశ్య నేతల నివాళి

సత్తెనపల్లి, జూన్ 30 : ఆర్యవైశ్య నేత వెలుగూరి వెంకటేశ్వర్లు 52వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో ఆర్యవైశ్య నేతలు ఏరియా వైద్యశాల వద్దనున్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముగ్గురు పేదలకు వెట్ గ్రైండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెమిలి రాధాకృష్ణమూర్తి, సింగరి మధుసూదనరావు, పీ వెంకటేశ్వరరావు, చౌటశ్రీనివారావు, వెలుగూరి శరత్‌బాబు, కొత్తరామకృష్ణ, అచ్యుత శివప్రసాదు పాల్గొన్నారు.



రాజుపాలెం బస్టాండ్ సెంటర్లో నిలిచిన వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు..

● బస్టాండ్ ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

రాజుపాలెం, జూన్30: మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామ బస్టాండ్ సెంటర్ వర్షపు నీటితో నిండిపోయింది. ప్రయాణికులు బస్సులు దిగే ప్రాంతం నుంచి యూనియన్ బ్యాంక్ వరకు రోడ్డుకు రెండువైపులా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజుపాలెం మండలకేంద్రం కావటంతో మండల స్థాయి అధికారులందరూ ఇక్కడే బస్సు దిగి వారి వారి కార్యాలయాలకు వెళ్తుంటారు. అయినా ఏ ఒక్కరూ కూడా వర్షపు నీరు నిలబడిన ప్రాంతంలో గ్రావెల్ తోలించి ప్రయాణికుల ఇబ్బందిని తొలగించే ప్రయత్నం చేయకపోవటం గమనార్హం. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్ నుంచి పులిచింతల పునరావస కేంద్రానికి వెళ్లే రహదారి ప్రారంభంలో వర్షపు నీరు ఎక్కువగా నిలబడటంతో స్థానికులు పంచాయితీ అధికారులపై మండిపడుతున్నారు.

తురకపాలెంలో పారిశుధ్య చర్యలు

మాచవరం, జూన్ 30: మండలంలోని తురకపాలెం గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాలు కురుస్తుండటంతో కొత్తనీరు వచ్చి చేరడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు మాజీ సర్పంచ్ షేక్ మాబుసుభాని, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలోని మినీ వాటర్‌ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రపరిచామన్నారు. సైడు కాల్వలోని తాగునీటి పైపులను పైకి ఏర్పాటుచేసి కాల్వల్లో మురుగునీరు పారుదలకు ఆటకం లేకుండా చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడా కూడా అపరిశుభ్రత లేకుండా చేస్తున్నామని, సచివాలయం, రైతు సేవా కేంద్రాలు, పీహెచ్‌సీ సబ్‌సెంటర్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించామన్నారు.

దేవాలయ భూముల ఆక్రమణ తగదు

● శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై అర్చకులు, కౌలుదారులు ఆగ్రహం

దాచేపల్లి, జూన్30: దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంకు చెందిన 12 ఎకరాల భూమిని శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించినట్లు ఇప్పటివరకు భూమిని సాగుచేసుకుంటున్న కౌలురైతులు, ఆలయ అర్చకులు ఆందోళన వ్యక్తంచేశారు. వందల సంవత్సరాల తరబడి ఆలయంలో దూప, దీప, నైవేద్యాలకు గాను నాటి పెద్దలు విరాళంగా అందజేసిన భూమిని ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించుకోవడం ఏమిటని అర్చకులు, కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా ఫ్యాక్టరీ సమీపంలోని ఇరిగేషన్ శాఖకు సంబంధించిన మరో ఎకరంన్నర భూమిని కూడా ఆక్రమించినట్లు వారు ఆరోపించారు. సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీ సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్మాణ చర్యలు చేపట్టిందని, దీనిలో భాగంగా పొలాలకు వెళ్లే రహదారులలో కరెంటు తీగల ఏర్పాటుకు గోతులు తవ్వుతున్నారన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా ఘటనలు జరిగితే రైతులు, పశువులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల సమస్యలను, దేవాలయ భూముల సమస్యలను పరిగణనలోకి తీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడి.. ఇద్దరికి గాయాలు

మాచర్లరూరల్, జూన్ 30: పిచ్చికుక్క దాడిలో ఓ బాలుడు, బాలిక గాయపడి ఆస్పత్రిపాలైన ఘటన మాచర్ల మండలం రాయవరం గ్రామ శివారులోని గోపాలపురం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కొమెర రవికుమార్, బీ.అక్షరలు ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చికుక్క రవికుమార్ చేతులపై, అక్షర మొఖంపై కరిచి తీవ్రంగా గాయపరిచింది. దీంతో వారిని స్థానికులు మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్సను అందిస్తున్నారు. రవికుమార్ పదో తరగతి చదువుతుండగా, అక్షర ఆరో తరగతి చదువుతోంది.



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక, బాలుడు

నేడు పెదకూరపాడుకు ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 30: పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం పెదకూరపాడు వస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రవీణ్ పాల్గొంటారని తెలిపారు. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేయనున్నారని, ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

బాలచాముండికా సమేత అమరేశ్వ రాలయంను రాష్ట్ర పోలీసు రిక్రూట్ మెంట్ ఛైర్మన్, ఐజీ రాజశేఖర్ బాబు దంపతులు ఆదివారం సందర్శించారు. అర్చకులు వారికి స్వాగతం పలికి, వారి పేరుపై పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అంద జేశారు. వారితో ఈవో వేమూరి గోపి పాల్గొన్నారు - **అమరావతి**



పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

● ఆస్పత్రిలోనే అన్ని పరీక్షలు

సత్తెనపల్లి, జూన్ 30: పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పూర్తి భరోసాను కల్పించనుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను గుర్తించి వాటిని పక్షాళన చేసే దిశగా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగికి ఒక్క రూపాయి ఖర్చు కాకుండా ఆస్పత్రిలోనే అందుబాటులోవున్న అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆస్పత్రి వర్గాలకు ఆదేశాలు జారీ చేశారు. సత్తెనపల్లి వైద్యశాలకు వచ్చే రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, మందులను ఆస్పత్రి ఆవరణలోని కేంద్రాల్లోనే అందించాలని, ప్రైవేట్‌గా బయటి వారికి పరీక్షలు రాస్తే ఆయా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ లక్ష్మణరావు హెచ్చరించారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలో సేవలపై నిర్లక్ష్యం అలముకుంది. మందులు, ల్యాబ్‌లకు అందించే బడ్జెట్‌లో కోత విధించటంతో చాలావరకు పరీక్షలు బయట చేయించుకొని మందులు కొనుక్కోవాల్సి వచ్చేది. దీంతో కొంతమంది వైద్యులు ప్రైవేట్ ల్యాబ్‌లతో ఒప్పందాలు కుదుర్చుకొని పరీక్షలు రాసేవారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన కొన్ని రకాల పరీక్షలు మందులు బయట కొనుక్కోవాల్సి వచ్చేదని రోగులు ఆవేదన వ్యక్తం చేసేవారు. ప్రభుత్వ వైద్య సేవల్లో లోపం ఎక్కడ ఉందో తెలుసుకోవటానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఉన్నతాధికారులతో ఇటీవల సమావేశాలు నిర్వహించారు. ఆస్పత్రిలో పేదలకు ఉచిత వైద్యసేవలు అందించేలా ప్రత్యేక చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ల్యాబ్‌లో వంద రకాల పరీక్షలు చేయాలని తెలిపారు. గత ప్రభుత్వం బడ్జెట్‌ను తగ్గించింది. దీంతో కొన్ని రకాల పరీక్షలకు కావాల్సిన కిట్లు రాక పోవటంతో కొన్నిరకాల పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లలో చేయించు కోవటంతో రోగులకు భారం పడేది. బడ్జెట్ నిధులను ఏడాదికి ఏడాదికి పెంచాల్సి ఉండగా తగ్గించారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఆస్పత్రి అభివృద్ధి నిధులు ఖర్చు చేసి ఆస్పత్రికి వచ్చే రోగికి అవసరమైన మందులు, స్కానింగ్ చేసే వారు. మెడాల్ ల్యాబ్‌తో ఒప్పందం కుదుర్చుకొని అన్నిరకాల పరీక్షలను ఉచితంగా చేసేవారు. ఇది రోగులకు ఎంతో ఉపయోగపడేది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మెడాల్ సంస్థ సేవలను తొలగించింది. కూటమి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అన్ని రకాల వైద్య సేవలను పరీక్షలు రోగులకు అందించాలని ఆదేశాలు జారీ చేయటంతో రోగులకు మేలు జరగనుంది. ఆస్పత్రిలోనే అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నామని, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉందని, అలాగే అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగికి ఒక్క రూపాయి ఖర్చులేకుండా మెరుగైన వైద్యం అందించి ఆరోగ్యభద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆస్పత్రిని మరింతగా అభివృద్ధి చేసుకుంటామని ఆయన తెలిపారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లు

మాచర్ల రూరల్, జూన్ 30: వెల్దుర్తి మండలంలోని ఉప్పలపాడు నుంచి దుర్గి మండలం ముటుకూరు వరకు 17.6 కి.మీ.ల మేర రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రహదారి నిర్మాణ పనుల ప్రారంభానికి సోమవారం ఉదయం 9 గంటలకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి

బెల్లంకొండ, జూన్ 30: గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని పెదకూరపాడు సీఐ మంగారావు పేర్కొన్నారు. ఆదివారం బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో విజిట్‌తో పాటు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మంగారావు మాట్లాడుతూ గొడవలు పడి జైలుకు వెళితే కుటుంబం చిన్నాభిన్న మవుతుందని, కలసికట్టుగా పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో సీఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు సీఐ కార్యాలయానికి వచ్చి నేరుగా వారి సమస్యలను అర్జీల రూపంలో అందజేయవచ్చని సూచించారు. పెదకూరపాడు సీఐ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీఐ అందుబాటులో ఉంటారన్నారు. అదేవిధంగా బెల్లంకొండ పోలీసుస్టేషన్‌లోనూ సోమవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నామని, ప్రజలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఐ అందుబాటులో ఉంటారని, సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్, సిబ్బంది ఎల్ వెంకటేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును సత్కరిస్తున్న సీఎంఈ నిర్వాహకులు, డాక్టర్లు

'సీఎంఈ'తో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 30: నరసరావుపేటలో కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమంతో వైద్యులు కొత్తవిషయాలను నేర్చుకోవచ్చునని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో సీఎంఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ సీఎంఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. డాక్టర్లు పుస్తకాలు చదవటంతో పాటు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నూతన విషయాలను నేర్చుకోవచ్చు అన్నారు. నరసరావుపేటలో లాభాపేక్షలేకుండా సేవ చేసిన డాక్టర్స్ చాలామంది ఉన్నారని, వారిలో మొదటిగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారన్నారు. మీరుకూడా లాభాపేక్ష లేకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. మారుమూల ప్రాంతాలలో కూడా ఎంతో మంది వైద్యులు సాయం అందిస్తున్నారని, డాక్టర్లు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, అర్ధరాత్రి అయినా అందుబాటులో ఉంటామని, అలాంటి వాళ్ళలో ఎర్రగొండపాలెం డాక్టర్ మన్యం రవీంద్ర, జాన్సన్, బెంజిమెన్ ఉన్నారని తెలిపారు. సీఎంఈ కార్యక్రమాలు ప్రతి నెల జరిగేలా చూడాలన్నారు. వాటికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, పల్నాడు జిల్లా ఐఎంఏ అభివృద్ధికి నావంతుసాయం అందజేస్తామన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ సీఎంఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా వైద్యులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవచ్చునన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ మర్రి పెద్దయ్య, డాక్టర్ చదలవాడ అరవిందబాబును సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ సూర్యనారాయణ, ప్రముఖ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మయ్య సేవలు ప్రశంసనీయం

● డీఎల్ఏటీవో డాక్టర్ మురళీకృష్ణ



వీరబ్రహ్మయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న డీఎల్ఏటీవో డాక్టర్ మురళీకృష్ణ, సూపరింటెండెంట్ హరిప్రసాద్ తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 30: డిప్యూటీ పారామెడికల్ ఆఫీసరుగా నడిపినేని వీరబ్రహ్మయ్య అంకితభావంతో పనిచేశారని డీఎల్ఏటీవో డాక్టర్ కే మురళీకృష్ణ అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేట కుష్టు, ఎయిడ్స్, టీబీ కార్యాలయంలో పదవీ విరమణ చేసిన నడిపినేని వీరబ్రహ్మయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే మురళీకృష్ణ మాట్లాడుతూ నడిపినేని వీరబ్రహ్మయ్య 32 సంవత్సరాలుగా కుష్టు, వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఈవో కే శోభారాణి, కార్యలయ సూపరింటెండెంట్ హరిప్రసాదు, ఇతర అధికారులు, సహచర ఉద్యోగులు పాల్గొని జ్ఞాపిక అందజేశారు.

శిథిలావస్థలో వేల్పూరు పశు వైద్యశాల భవనం

● శ్లాబు పెచ్చులూడి పడుతున్నవైనం
● మురుగునీరు పారుదల లేక తీవ్ర అవస్థలు
● నూతన భవనం నిర్మించి, వసతులు కల్పించాలని వినతి



పెచ్చులూడిన పశువైద్యశాల భవనం శ్లాబు, పశువైద్యశాల ఆవరణలో నిలబడిన వర్షపునీరు

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 30: మండలంలోని వేల్పూరులో సుమారు 50ఏళ్ళ క్రితం నిర్మించిన పశు వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొంది. వర్షాలకు భవనం శ్లాబు పూర్తిగా దెబ్బతినడంతో పెచ్చులు ఊడిపడుతూ ప్రమాదభరితంగా మారింది. భవనంలో విధులు నిర్వహించాలంటే ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. మురుగునీరు పారుదల సౌకర్యం లేకపోవంతో వర్షపు నీరు ఆస్పత్రి ఆవరణలోనే నిలిచి దుర్వాసనను వెదజల్లుతోంది. దీంతో పాటు బయటి నీరు సైతం ఆస్పత్రి ఆవరణలోకి చేరుతోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే పశు పోషకులు బురదలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. పశు వైద్యశాల భవనాల మరమ్మతుల నిమిత్తం గతేడాది మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలు కేటాయించామని అధికారులు, ప్రజాప్రతినిదులు చెప్పారే గానీ, ఎక్కడా పనులు చేపట్టింది లేదు. పశు వైద్యశాల శిథిలావస్థకు చేరడంతో, ఆస్పత్రిలో నెలకొన్న వివిధ సమస్యలతో ఆస్పత్రి అధికారులు, సిబ్బందితోపాటు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి పశు వైద్యశాలకు నూతన భవనాన్ని నిర్మించి అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు.

సాగర్ కుడికాలువల మరమ్మతులు నిర్వహించాలి

జేసీకి సీపీఐ నాయకుల వినతి



జేసీ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు కాసా రాంబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 30: నాగార్జునసాగర్ కుడికాలువల పూడికలు, మరమ్మతులు సత్వరమే నిర్వహించాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాదుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడికాలువల పరిధిలో పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలో 126 కిలోమీటర్ల పొడవు కలిగి 14వేల కిలోమీటర్ల పొడవు గల బ్రాంచ్, మేజర్, మైనర్ కాలువలలో సుమారు 12 లక్షల ఎకరాలకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. నీటి సరఫరా తాగునీటి చెరువులో పశువుల కుంటలు, విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. కుడికాలువ పరిధిలో ప్రధాన కాలువ, బ్రాంచ్ కాలువ, మైనర్లు, కాలువలు షిల్టు పేరుకుపోయి పూడిపోయి ఉన్నాయన్నారు. నాచు, తూటుకాడ, రబ్బరుచెట్లు కాలువలలో నిండిపోయి అల్లుకుపోయి ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవతీసుకొని రిపేర్లు, పూడికలు, నాచు, తూటుకాడ, రబ్బరుచెట్లు తక్షణమే తొలగించి కాలువలను శుభ్రంచేసి చివరి భూములకు నీరుఇచ్చే విధంగా చూడాలన్నారు. రైతులు ఉపయోగించే ట్రాక్టర్లు, గొర్రుచెట్లు, నాగలిసెట్లు అనేక వ్యవసాయ పనిముట్లు రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం ఇవ్వాలని, బ్యాంకులలో రైతులకు రూ.3లక్షల వరకు వడ్డీలేని రుణాలను ఇవ్వాలన్నారు. ఆపై తీసుకున్నవారికి రూ.0.25లకు రుణాలు సకాలంలో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు నిర్వహిస్తే 10లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పలపాటి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు: ఎంపీడీవో లక్ష్మీ కుమారి

రొంపిచర్ల, జూన్ 30: మండలంలోని గ్రామాల్లో ఎన్‌టీఆర్ భరోసా కింద జూలై 1న పింఛన్లను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో లక్ష్మీకుమారి ఆదివారం తెలిపారు. 9,655 మందికి రూ.6.57కోట్ల మేర పింఛన్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. మూడు నెలలు పింఛను పెంచిన వ్యత్యాసం, పెంచిన పింఛను కలిపి లబ్ధి దారులకు అందజేయనున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి పింఛను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

నేడు 42,153మందికి పింఛన్ల పంపిణీ

వినుకొండ టౌన్ జూన్ 30: కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో రూ.3వేల రూపాయల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. మొత్తం 42,153 మందికి పంపిణీ చేయనున్నారు. జూలై 1వ తేదీ నుంచి సచివాలయం సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఎన్‌టీఆర్ భరోసా కింద బొల్లాపల్లి 8986, ఈపూరు 6652, నూజెండ్ల 7097, శావల్యాపురం మండలాల్లో 6031 మందికి, వినుకొండ పరిధిలో 7874, వినుకొండ పట్టణంలో 5513 మందికి పింఛనును అందిచనున్నారు. వినుకొండ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

విత్తనాలపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

● ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు

శావల్యాపురం, జూన్ 30: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులు పొలాల్లో సాగు చేసుకునేందుకు ప్రభుత్వం కంది విత్తనాలను రాయితీలపై అందిస్తుందని, రైతులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో కంది విత్తనాలు క్వింటాధర రూ.13,980 ఉండగా దానిలో 30శాతం రాయితీపోను రూ.9786లకే ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో రైతులకందించేందుకు ప్రభుత్వం 69క్వింటాళ్ళ కంది విత్తనాలను అందజేసిందని, మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలలో కంది విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు వారి పరిధిలోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్ళి వీఏఏలను సంప్రదించి బయోమెట్రిక్ వేసి కందివిత్తనాలను పొందవచ్చన్నారు. రైతులు పొలాల్లో చల్లుకునేందుకు జనుములు, జీలగలు, పిల్లిపెసర విత్తనాలు కూడా ప్రభుత్వం 50శాతం రాయితీపై అందిస్తుందని, మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలలో జనుములు, జీలగలు, పిల్లిపెసర విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పీఎం కిసాన్, రైతుభరోసా పథకాలకు అర్హులు వీఏఏలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నరసరావుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

నరసరావుపేట టౌన్, జూన్ 30: నరసరావుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక 2024-25 సంవత్సరానికి జరిగిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. నూతన అధ్యక్షుడిగా కపిలవాయి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా ఎస్.శివకుమార్, కోశాధికారిగా కట్టమూరి ఆంజనేయులు ఎంపికయ్యారన్నారు. నూతన కార్యవర్గాన్ని సి.రాజేష్, కేపీ రంగారావు, టి.రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు అభినందించారు.

నేడు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో మీ కోసం

నరసరావుపేట లీగల్, జూన్ 30: ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలకు పోలీసు స్టేషన్ ఆవరణలో ఈ నెల 1వ తేదీన నిర్వహించనున్నట్టు సీఐ భాస్కర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు.



స్కేటింగ్ ప్లాట్‌ఫాం వద్ద కూర్చున్న మందుబాబులు, పార్కులో పడవేసిన మద్యం సీసాలు

మందు బాబులకు అడ్డాగా మునిసిపల్ పార్కు

● ఉద్యనవనాన్ని పాడుబెట్టిన పురపాలకులు ● రూ.108 లక్షలు వృథా



కట్ చేసిన డ్రిప్ పైపులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజలకు ఆరోగ్యం, అహ్లాదం కల్పించేందుకు ఒక్క ఉద్యనవనం కూడా లేదు. చిన్నారులకు వినోదం కలిగించే రీతిలో పార్కుల అభివృద్ధి జరగలేదు. ఉద్యనవనాలను అభివృద్ధి చేయడం ఎలా ఉన్నా ఉన్న పార్కులను మునిసిపాల్టీ పాడు బెట్టింది. పల్నాడు రోడ్డులోని కాసు బ్రహ్మానందరెడ్డి మునిసిపాల్టీ ఉద్యానవనం మందుబాబులకు అడ్డాగా మారి, అసాంఘిక కార్యక్రమాలకు నెలవైంది. పార్కు నిర్వహణను పురపాలకసంఘం గాలికొదిలేశారు. అమృత్ పథకంలో భాగంగా రూ.108 లక్షలతో పార్కును గత తెలుగుదేశం కౌన్సిల్ హయాంలో నిర్మించారు. దీనిని 2019 జనవరిలో ప్రారంభించారు. కొద్ది నెలల పాటు పార్కును తెరచి ఉంచారు. గత ఐదేళ్ల పార్కును మునిసిపాల్టీ మూసివేసి పాడుబెట్టారు. ఉద్యానవనంలో ఓపెన్ వేదిక, స్కేటింగ్ ప్లాట్‌పాం, కూర్చునేందుకు వీలుగా షెల్టర్స్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుతో పాటు అందమైన మొక్కలను నాటారు. వీటి సంరక్షణను గాలికొది లేశారు. పార్కులో విచ్చలవిడిగా రాత్రి పగలు అన్న తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. ఉద్యానవనం కోసం వెచ్చించిన నిధులు వృథాగా మారాయని చెప్పవచ్చు. ఇప్పటికైనా విశాలమైన బ్రహ్మానందరెడ్డి పార్కును తిరిగి తెరచి పట్టణ వాసులకు అహ్లాదం అందించేందుకు మునిసిపాల్టీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వెల్లటూరులో 250 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు

బొల్లాపల్లి, జూన్ 30: మండలంలోని వెల్లటూరులో శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ వినుకొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తా సూపర్ స్పెషాలిటీ మేనేజింగ్ డైరెక్టర్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. వినుకొండలోని ఏనుగుపాలెం రోడ్డులోని శ్రీదత్తా సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గుండె, కిడ్నీ, మెదడు, నరాలు, ఊపిరితిత్తులు, జనరల్ మెడిసన్, గైనకాలజీ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలు కన్పించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ చల్లా వెంకటేశ్వరరావు సూచించారు. వైద్య శిబిరంలో అత్యవసర, క్రిటికల్ కేర్ స్పెషాలిటీ డాక్టర్ శ్యామల్, డాక్టర్ భవానీ, శ్రీ దత్తా సూపర్ స్పెషాలీ జనరల్ మేనేజర్ భైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాశిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సుబ్బారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ నందకిషోర్ సేవలు అభినందనీయం

గంటవారిపాలెం (శావల్యాపురం) జూన్ 30: ఎన్నెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా అనిశెట్టి నందకిషోర్ అందించిన సేవలు అభినందనీయమని గంటవారిపాలెం సెక్టార్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోట్లూరి లక్ష్మీనారాయణ కొనియాడారు. మండలంలోని గంటవారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 34ఏళ్ళ పాటు విధులు నిర్వహించి ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన నందకిషోర్‌ను గంటవారిపాలెంలోని ఎన్నెస్పీ కార్యాలయంలో ఏఈఈ, ఎన్నెస్పీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రమణ, లస్కర్‌లు వెంకటేశ్వర్లు, సీతారామాంజనేయులు, దేవకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 38వేల మందికి పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు

చిలకలూరిపేట, జూన్ 30: చిలకలూరిపేట నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 37,982 మందికి రూ.27కోట్ల మొత్తాన్ని పింఛనుగా అందజేయనున్నారు. ఉదయం 6గంటల నుంచే సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పింఛన్ మొత్తాన్ని అందజేయనున్నారు. చిలకలూరిపేట మండలంలో 8,782, యడ్లపాడు మండలంలో 8,110, నాదెండ్ల మండలంలో 9,694, చిలకలూరిపేట మునిసిపాలిటీలో 11,396 మందికి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు జరిగాయి. ఇప్పటికే అధికారులు బ్యాంకుల నుంచి డబ్బులు తీసి సిద్ధంగా ఉంచారు. చిలకలూరిపేట పట్టణంలో పింఛన్‌ల పంపిణీకి 215మంది సిబ్బందిని నియమించారు. పట్టణ పరిధిలో రూ.7.77 కోట్ల మొత్తాన్ని పింఛన్ మొత్తంగా పంపిణీ చేయనున్నట్టు మునిసిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. కాగా పెంచిన పింఛనుతో కలిపి మూడు నెలల మొత్తాన్ని కూడా కలిపి రూ.7వేలు చొప్పున పింఛన్ అందజేయటంపై పింఛన్‌దారులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. చిలకలూరిపేట మండలం గొట్టిపాడు గ్రామంలోని చెంచు కాలనీలో పింఛన్‌దారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కాలనీ ముఖద్వారానికి ఫ్లెక్సీలు తగిలించారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు ఇంటి వద్దకే పింఛన్లను పంపిణీ చేయటం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ పెంటేల బాలాజీ పేర్కొన్నారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు, జూన్ 30: సామాజిక పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీవో ఆదివారం మాట్లాడుతూ మండలంలోని 12గ్రామ సచివాలయాల పరిధిలో సామాజిక పింఛన్ ప్రయోజనాన్ని పొందే లబ్ధిదారులు 8,073 మంది ఉన్నారు. వీరందరికీ జూలై 1నే పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా పాల్గొని పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారన్నారు. యడ్లపాడు, మైదవోలు, లింగారావుపాలెం గ్రామాలలో పర్యటించి పింఛన్‌లు పంపిణీ చేస్తారని, అనంతరం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని వెల్లడించారు. మండల, గ్రామస్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 62 కేసుల పరిష్కారం

చిలకలూరిపేట, జూన్ 30: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో మొత్తం 62 కేసులు పరిష్కారమయ్యాయి. సంస్థ ఛైర్మన్ కే నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ అదాలత్ శనివారం రాత్రి వరకు జరిగింది. అన్ని కేసులకు కలిపి అవార్డు కింద రూ.76.59 లక్షలు ఇచ్చారు. పరిష్కారమైన కేసుల్లో క్రిమినల్ ఐపీసీ కేసులు 31, సివిల్ కేసులు 17, చెక్ బౌన్స్ కేసులు ఐదు, భరణం కేసులు రెండు, డీబీసీ కేసులు మూడు, పీఎల్‌సీ కేసులు నాలుగు ఉన్నాయి.



వినుకొండ డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు దంపతులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రెవెన్యూ అధికారులు

డీటీ అబ్బూరి వెంకటేశ్వర్లుకు సత్కారం

వినుకొండ జూన్ 30: వినుకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్బూరి వెంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆదివారం అధికారులు, సిబ్బంది సత్కారించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. అబ్బూరి వెంకటేశ్వర్లు అంకితభావంతో విధులు నిర్వహించి, నిస్వార్థంతో ప్రజలకు వివిధ ప్రాంతాల్లో 33 సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో ఆయన చేసిన సేవలను గుర్చి మక్కెన కొనియాడారు. కార్యక్రమంలో వినుకొండ తహసీల్దార్ బ్రహ్మయ్య, దానియేలు, ఆర్ఐ శ్రీహరి, డీలర్ల సంఘం అధ్యక్షుడు అక్కయ్య, సూర్యపేట సీఐ రాఘవులు, అబ్బూరి వీరయ్య, అనుమల వెంకయ్య చౌదరి, కిరకంచి వెంకట్రాము, న్యాయవాదులు సైదారావు, రామకోటేశ్వరరావు, వైసీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, సైదా, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయర్లు, కార్యాలయం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అబ్బూరి వెంకటేశ్వర్లు దంపతులకు అభినందనలు తెలిపారు.

పింఛన్ల మంజూరులో వైసీపీ నేతల అక్రమాలు: హరిబాబు

శావల్యాపురం, జూన్ 30: ఐదేళ్ళ వైసీపీ పాలనలో సామాజిక పింఛన్‌ల మంజూరులో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పూర్తిస్థాయిలో అక్రమాలకు పాల్పడినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు, కారుమంచి ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు ఆరోపించారు. మండలంలోని కారుమంచి గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కారుమంచి, శానంపూడి, శావల్యాపురం, కొత్తలూరు తదితర గ్రామాలలో వైసీపీ నాయకులు సొంతపార్టీ వారికి ఎటువంటి అంగవైకల్యం లేకపోయినా ఉన్నట్లుగా డాక్టర్‌కు డబ్బులిచ్చి సదరం సర్టిఫికెట్లు తెప్పించుకొని వికలాంగ పింఛన్‌లను పొందారని, 60ఏళ్ళు నిండకుండానే కొందరు ఆధార్‌కార్డులో వయసు మార్పిడి చేయించుకొని వృద్ధాప్య పింఛన్లు పొందారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని గ్రామాల్లోని వైసీపీ నాయకులు బ్రోకర్లతో కుమ్మక్కై, ఒక్కొక్క లబ్ధిదారుని దగ్గర రూ.10వేల నుంచి రూ.15వేలవరకు లంచంగా తీసుకొని సదరం క్యాంపుల వద్ద డాక్టర్‌లకు కొంత ముట్టజెప్పి మిగిలిన మొత్తాన్ని పంచుకున్నారని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులు కొందరు ఆధార్‌లో అక్రమాలకు తెరలేపి వైసీపీ వర్గీయులకు వయసును మార్పిడిచేసి పింఛన్ల మంజూరు చేయించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు భర్తలతో విడాకులు పొందకుండానే తప్పుడు ఆధారాలతో ఒంటరి మహిళల పింఛన్లు పొందారని, ఒకేఇంట్లో భార్యభర్తలు కలసి ఉంటున్నా అధికారులు దర్యాప్తు చేయకుండానే పింఛన్లు మంజూరు చేశారన్నారు. మండలంలో 1000మందికి పైగా అర్హతలేనివారు పింఛన్లు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పింఛన్లపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, నకిలీ పింఛన్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనతో టీడీపీ నాయకులు ఎం.వెంకటనారాయణ, టి.రవిశంకర్ తదితరులు ఉన్నారు.

డీఎడ్ కోర్సు ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్

నరసరావుపేట టౌన్, జూన్ 30: డిప్లమో ఇన్ ఎడ్యుకేషన్ కోర్స్ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ జూన్ 30 నుంచి జూలై 4వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చునని మేదరమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మేదరమెట్ల రామశేషగిరిరావు ఆదివారం తెలిపారు. మొదటి విడత ఆప్షన్ ఇవ్వనివారు మొదటి విడతలో సీటు రానివారు ఈ అవకాశం వినియోగించుకోవచ్చునని తెలిపారు. వీరికి జూలై 5 నుంచి ఏడో తేదీ వరకు సీట్లు కేటాయింపు ఉంటుందని, జూలై 9 నుంచి 13 వరకు ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు.



బొమ్మరాజుపల్లి సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డుపైన ఉన్న చెట్టుకొమ్మలు

రహదారి మలుపులో ప్రమాదకరంగా చెట్లకొమ్మలు

ఈపూరు, జూన్ 30: మండలంలోని బొమ్మరాజుపల్లి సమీపంలో మూలమలుపు వద్ద విరిగిపడిన చెట్టును నరికివేసి కొమ్మలను రోడ్డుపైన వదిలివెళ్ళారు. రోడ్డుపైన కొమ్మలు ఉండడంతో రాత్రులు ఆమార్గంలో వెళ్లే వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా రోడ్డు మలుపుల వద్ద కంపచెట్లు రోడ్డుపైకి వచ్చాయి. వినుకొండ నుంచి హైదరాబాద్‌కు ఇటువైపు నుంచి ఆర్‌టీసీ బస్సులు, వాహనాలు అధికసంఖ్యలో వెళ్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైన ఉన్న చెట్లకొమ్మలను తొలగించి, కంపచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుచున్నారు.